మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక

మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..

Pubilished From Jagitial www.evarthalu.com

సోమవారం MONDAY 29-9-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 || సంచిక: 91 Issue: 91

29 సెప్టెంబర్ 2025 - సోమవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు ఆశ్వయుజ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:09 సూర్యాస్తమయం - సా. 6:03 తిథి సప్తమి సా. 4:28 వరకు తరువాత అష్టమి సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం మూల ఉ. 6:09ం వరకు యోగం సౌభాగ్య రా. 12:56ం వరకు కరణం వనిజ సా. 4:28 వరకు విష్టి తె. 5:23ం వరకు వర్జ్యం తె. 4:31 నుండి ఉ. 6:16 వరకు దుర్ముహూర్తం మ. 2:52 నుండి మ. 3:40 వరకు మ. 2:52 నుండి మ. 3:40 వరకు రాహుకాలం ఉ. 7:38 నుండి ఉ. 9:08 వరకు యమగండం ఉ. 10:37 నుండి మ. 12:06 వరకు గుళికాకాలం మ. 1:35 నుండి మ. 3:04 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:33 నుండి తె. 5:21 వరకు అమృత ఘడియలు రా. 11:19 నుండి రా. 1:05 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:42 నుండి మ. 12:30 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



నేటి అవతారం:
సరస్వతీ దేవి

శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానం, విజయవాడ

పహల్గాం దాడి తర్వాత పాక్ పేరెత్తితేనే ఒళ్లు మంట..
'ఆపరేషన్ సిందూర్'తో దాయాదిని ఈడ్చికొట్టేశాం..
ఆ దేశంతో సంబంధాలే వద్దనుకొనేంత కోపంతో ఉన్నాం..
పాకిస్థానీలతో లెక్కాపత్రం ఏదీ లేదని భీష్మించుకున్నాం..
కానీ.. ఆసియాకప్‌లో దాయాదితో పోరాడాల్సిన స్థితి..
ఆ దేశంతో ఇంకేం క్రికెట్ ఆడటం అని కొందరు..
ఆడాలి.. పాక్‌ను బరివాతల నిలబెట్టాలని ఇంకొందరు..
మరి ఓడితే ఎలా.. అన్న సంశయమూ మదిలో..
అవతల డోనాల్డ్ ట్రంప్ కాచుకొని కూర్చున్నాడు..




ప్రతీసారి తానే భారత్-పాక్ యుద్ధాన్ని ఆపానంటాడు..
భారత్ గెలిస్తే సరి.. ఓడితే అంతా వేలెత్తి చూపుతారు..
యుద్ధంలో ఓడిపోయినంతగా పరువు పోతుంది..
అలాంటప్పుడు ఏం చేయాలి..?
ఏది చేయాలో అదే చేశారు..
మన టీమిండియా క్రికెటర్లు
భారతావని ఏది కోరుకున్నదో..
అదే చేసి చూపించారు..!
ఆసియాకప్‌ను భరతమాత ఒడిలో చేర్చారు..!!



# సిందూర తిలక్

## ఉత్కంఠ పోరులో టీమిండియా గ్రాండ్ విక్టరీ

### దాయాది పాక్‌పై సూర్యసేన జయకేతనం.. ఈ ఆసియాకప్‌లో ముచ్చటగా మూడోసారి గెలుపు

### బౌలింగ్‌లో కుల్దీప్ యాదవ్ మాయాజాలం.. బ్యాటింగ్‌లో తిలక్ వర్మతో శివమ్ దుబే కీలక ఇన్నింగ్స్

తలబడిన చోటల్లా పాక్‌ను తుత్తునియలు చేస్తూ ఆసియా కప్ ఫైనల్‌లో అడుగుపెట్టిన టీమిండియా.. అక్కడా దాయాది మెడలు వంచింది. పహల్గాం దాడికి ప్రతీకారాన్ని తీర్చుకొంటూ కాసింత ఉపశమనాన్ని మిగిల్చింది. షేక్ హ్యాండ్‌కు నో చెప్తూనే పాక్‌పై పై చేయి సాధించారు మన కుర్రాళ్లు. ఆపరేషన్ సిందూర్‌కు కొనసాగింపుగా అన్నట్లు ఫైనల్ మ్యాచ్ జరిగింది.

ఈసారి బ్యాట్ అనే తుపాకీని మన హైదరాబాదీ తిలక్ వర్మ చేత పట్టుకున్నాడు. 'ఆపరేషన్ తిలక్' అన్నట్లు సందర్భాన్ని బట్టి ఫోర్ల బుల్లెట్ వర్షం కురిపిస్తూ, సిక్సుల బాంబులేస్తూ ప్రత్యర్థిని చావుదెబ్బ కొట్టాడు. హాఫ్ సెంచరీ చేశాక భారత జవాన్లకు సెల్యూట్ చేసిన తిలక్ వర్మ.. తాను చేపట్టిన ఆపరేషన్‌ను విజయవంతంగా ముగించాడు. టీమిండియా సిగలో మరో ఆసియా కప్‌ను చేర్చాడు. అతడికి తోడుగా శివమ్ దుబే మంచి సహకారాన్ని అందించాడు. అంతకుముందు, అక్షర్, వరుణ్ చక్రవర్తి తోడుగా భూ చక్రాల్లాంటి బంతులతో కుల్దీప్ యాదవ్ పాక్ బ్యాటర్లను బెంబేలెత్తించాడు.



హైదరాబాద్‌లో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మిస్ వరల్డ్ ఓపల్ సుచాత

# 30నే సద్దుల బతుకమ్మ

### స్పష్టం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

బతుకమ్మ పండుగ మంగళవారం రావడంతో మంగళవారం పూట ఆడబిడ్డ(బతుకమ్మ)ను గంగమ్మ ఒడికి చేర్చాలా? అన్న సంశయం చాలా మందిలో నెలకొంది.

# న్యూయార్క్‌ను మరిపిస్తా

## పదేళ్లు అధికారం ఇవ్వండి

## ఊహించనంత అభివృద్ధి చేస్తా

## భారత్ ఫ్యూచర్ సిటీకి పునాది

### 20 కోట్లతో ఎఫ్‌సీడీఏ కార్యాలయానికి శంకుస్థాపన

### నాలుగు నెలల్లో భవనం పూర్తి: రేవంత్ రెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీ నిర్మాణ కార్యాచరణకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టారు. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్‌ఖాన్‌పేటలో ఫ్యూచర్ సిటీ అభివృద్ధి పనుల పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేయనున్న ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. సుమారు 15 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో.. రూ.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఈ అత్యాధునిక కార్యాలయ భవనం నాలుగు నెలల్లో పూర్తి కానుంది.



మీర్‌ఖాన్‌పేట/రంగారెడ్డి, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): భవిష్యత్తులో ఈ కార్యాలయం నుంచే ఫ్యూచర్ సిటీలో చేపట్టే అభివృద్ధి పనులు, పరిశ్రమలు, లేఅవుట్‌లకు సంబంధించిన అన్ని రకాల అనుమతులను అధికారులు మంజూరు చేస్తారు. ప్రభుత్వం సిద్ధం చేసిన ప్రణాళికల ప్రకారం.. ఫ్యూచర్ సిటీ దాదాపు 30 వేల ఎకరాల విస్తీర్ణంలో నిర్మాణం కానుంది. ఇది 7 మండలాలు, 56 రెవెన్యూ గ్రామాల పరిధిలో విస్తరించనుంది. ఈ ఫ్యూచర్ సిటీని 'నెట్-జీరో స్మార్ట్ సిటీ'గా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఫ్యూచర్ సిటీకి మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించేందుకు కీలక రహదారుల నిర్మాణం చేపట్టనున్నారు. ఇందులో భాగంగా శ్రీశైలం, నాగార్జునసాగర్ హైవేలను కలుపుతూ కొత్త ఈస్ట్-వెస్ట్ ట్రంక్ రోడ్డును నిర్మించనున్నారు. అవుటర్ రింగ్ రోడ్డు, ప్రాంతీయ రింగ్ రోడ్డులను అనుసంధానం -2 వ పేజీలో...



# రేవంత్ నల్లమల పిల్లి


## ఆల్మట్టి ఎత్తు పెంచితే ఇంట్లో కూర్చుంటారా?

### పులి అయితే అక్కడికి వెళ్లి గర్జించడం లేదేం?.. అచ్చంపేట జనగర్జన సభలో కేటీఆర్ ధ్వజం

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నిప్పులు చెరిగారు. కృష్ణా నదిపై కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యాం ఎత్తును 18 అడుగులు పెంచాలని నిర్ణయించడంపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. నల్లమల పులి అని చెప్పుకునే రేవంత్ రెడ్డి, ఆల్మట్టి ఎత్తు పెంచితే పాలమూరుకు చుక్క నీరు రాకుండా పోరాడకుండా.. పిల్లిలా ఇంట్లో కూర్చోవాలా, లేదా అక్కడికి వెళ్లి గర్జించాలా అని కేటీఆర్ సూటిగా ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి నల్లమల్ల పులి కాదని.. పిల్లి అని ఎద్దేవా చేశారు. అచ్చంపేట నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ పార్టీ జనగర్జన సభలో పాల్గొన్న కేటీఆర్.. ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.

అచ్చంపేట, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 70 వేల కోట్లు ఖర్చు పెట్టి ఆల్మట్టి ఎత్తును 519 మీటర్ల నుంచి మరో 5 మీటర్లు పెంచే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఈ నిర్ణయం వల్ల కృష్ణా నది కిందకు చుక్క నీరు రాకుండా పోతుందని, ఇది తెలంగాణ రైతులకు తీవ్ర అన్యాయమని ఆయన అన్నారు. నిజమైన పులి ఎలా ఉంటుందో కేటీఆర్ వివరించారు. నడిగడ్డకు నీళ్లు రావడం లేదని చెప్పి, తమ నీళ్లు తమకు రావాలని కేసీఆర్ ఆర్డీఎస్ వరకు పాదయాత్ర చేశారని- 2 వ పేజీలో...

## విశ్వవాణి



జర్మనీలోని ఓ సర్కస్ నిజమైన జంతు జీవాలకు బదులుగా 3డీ హెూలోగ్రఫిక్ వర్చువల్ ఫొటోలను ప్రదర్శిస్తోంది. హింస నుంచి జంతువులను కాపాడాలన్న ఉద్దేశంతోనే నిజమైన జంతువులను ప్రదర్శించడం లేదట.

# వోకల్ ఫర్ లోకల్

## 2న అంతా ఖాదీ ఉత్పత్తులే కొనాలి

### దేశ ప్రజలకు మోదీ పిలుపు.. జాతినుద్దేశించి మన్ కీ బాత్



న్యూఢిల్లీ: దేశ ప్రజలంతా అక్టోబర్ 2న ఖాదీ ఉత్పత్తులను కొనుగోలు చేయాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. ఆదివారం తన రేడియో కార్యక్రమం "మన్ కీ బాత్" 126వ ఎపిసోడ్ ద్వారా జాతినుద్దేశించి ప్రసంగించారు. భగత్ సింగ్, లతా మంగేష్కర్ జయంతి సందర్భంగా వారిని స్మరించుకున్నారు. సెప్టెంబర్ 22, 2025 నుండి దేశవ్యాప్తంగా కొత్త జీఎస్టీ పన్ను శ్లాబులు అమల్లోకి వచ్చిన తర్వాత తొలిసారి మోదీ "మన్ కీ బాత్"లో ప్రసంగించారు. భగత్ సింగ్ అందరికీ, ముఖ్యంగా యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. ఉరితీయడానికి ముందు, తరువాయి 2 వ పేజీలో...

# నేడు 'స్థానిక' నోటిఫికేషన్?

### 11 గంటలకు ఈసీ ప్రెస్‌మీట్!.. నోటిఫికేషన్ తర్వాతైనా హైకోర్టుకు జవాబు

### ముందుగా జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలు?

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): ఎప్పుడెప్పుడా అని ఎదురు చూస్తున్న స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ సోమవారం విడుదల కానున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచా రం. ఉదయం 11 గంటలకు ఎన్నికల సంఘం అధికారులు మీడియా సమావేశం నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ చేసే అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి. సోమవారం ఉదయం పంచాయతీరాజ్‌శాఖ నుంచి రిజర్వేషన్లు, ఓటర్ల జాబితాను ఎస్ ఈసీకి చేరనుంది. ఆ తర్వాత వెంటనే ఎస్ఈసీ స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ జారీ తరువాయి 2 వ పేజీలో...






## కరూర్ మృతుల కుటుంబాలకు విజయ్ రూ.20 లక్షలు

చెన్నై : తమిళ సినీ నటుడు, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ తన ప్రచార సభలో జరిగిన దుర్ఘటనపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కరూర్‌లో జరిగిన తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు భారీ ఆర్థిక సాయాన్ని ప్రకటించి తన బాధ్యతను చాటుకున్నారు. ఈ

## రాశి ఫలాలు

29.9.2025

మేషం: వ్యాపార, ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులుంటాయి. చిన్ననాటి మిత్రులతో కలహా సూచనలున్నవి. అనారోగ్య సమస్యలు కొంత ఇబ్బంది కలిగిస్తాయి. సంతాన విద్యా ఫలితాలు నిరుత్సాహ పరుస్తాయి. దైవ అనుగ్రహంతో కొన్ని పనులు పూర్తి చేస్తారు. దూరప్రయాణ సూచనలున్నవి.

వృషభం: చేపట్టిన పనులు వాయిదా వేస్తారు. ప్రయాణాలలో అప్రమత్తంగా వ్యవహరించాలి. రుణదాతల నుండి ఒత్తిడి పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. ఉద్యోగులకు అధికారులతో నూతన సమస్యలు కలుగుతాయి. ఆర్థిక వాతావరణం నిరుత్సాహంగా ఉంటుంది.

మిథునం: సమాజంలో ప్రముఖుల పరిచయాలు పెరుగుతాయి. మిత్రుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. కుటుంబ సభ్యులతో దైవ కార్యక్రమాలలో పాల్గొంటారు. ఆర్థిక అనుకూలత కలుగుతుంది. కుటుంబ వ్యవహారాలలో ముఖ్య నిర్ణయాలు అమలు పరుస్తారు. వ్యాపారాలు, ఉద్యోగాలు సంతృప్తికారంగం సాగుతాయి.

కర్కాటకం: చిన్ననాటి మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాలలో పాల్గొంటారు. విలువైన వస్తులాభాలు పొందుతారు. చేపట్టిన పనులలో యత్నకార్యసిద్ధి కలుగుతుంది. ప్రముఖులతో పరిచయాలు లాభిస్తాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వ్యాపారా, ఉద్యోగాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి.

సింహం: ముఖ్యమైన పనులు మధ్యలో నిలిచిపోతాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమకు తగిన ఫలితం ఉండదు. సన్నిహితులతో మాటపట్టింపులుంటాయి. మిత్రుల నుండి అవసరానికి ధన సహాయం అందుతుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం ఉద్యోగమున అదనపు బాధ్యతలు చికాకు పరుస్తాయి.

కన్య: చేపట్టిన పనులు నిదానంగా సాగుతాయి. వృథా ఖర్చులు పెరుగుతాయి. ఇంటా బయట పని ఒత్తిడి వలన తగిన విశ్రాంతి ఉండదు. కుటుంబ వాతావరణం గందరగోళంగా ఉంటుంది. దైవ సేవ కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపార విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి.

తుల: బంధు మిత్రులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. సంతానం పోటీపరీక్షల్లో విజయం సాధిస్తారు. ఆప్తుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుకుంటారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. స్థిరాస్తి వివాదాల పరిష్కార దిశగా సాగుతాయి. వ్యాపారమున కీలక నిర్ణయాలు అమలు పరుస్తారు. ఉద్యోగ వాతావరణం అనుకూలస్తుంది.

వృశ్చికం: కుటుంబ సభ్యులతో మాటపట్టింపులు కలుగుతాయి. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ముఖ్యమైన పనులు వాయిదా పడతాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వృత్తి వ్యాపారాలు నత్తనడకగా సాగుతాయి. ఉద్యోగులు అదనపు బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు.

ధనస్సు: నిరుద్యోగులకు నూతన ఉద్యోగ అవకాశాలు పొందుతారు. కుటుంబ పెద్దల ఆదరణ పెరుగుతుంది. బంధు మిత్రులతో విందు వినోద కార్యక్రమాలలో పాల్గొంటారు. నూతన వ్యాపార విస్తరణ ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. అవసరానికి చేతిలో డబ్బు నిలువక నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు.

మకరం: ముఖ్యమైన పనులు మందకొడిగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. ఇంటా బయట ఉహించిన ఒత్తిడి వలన మానసిక సమస్యలు కలుగుతాయి. దూరప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగాలలో చిన్నపాటి వివాదాలు తప్పవు.

కుంభం: దూరపు బంధువుల నుండి శుభవార్తలు అందుతాయి. ఆర్థిక పరంగా అనుకూలత సాధిస్తారు. నూతన వస్తు, వస్త్రలాభాలు పొందుతారు. చిన్ననాటి స్నేహితులతో దైవ సేవ కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు సజావుగా సాగుతాయి. ఉద్యోగమున జీత భత్యాల విషయంలో శుభఫలితాలు పొందుతారు.

మీనం: చిన్ననాటి మిత్రులతో గృహమున విందు వినోద కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉద్యోగమున మీ పని తీరుకు అధికారుల నుండి గుర్తింపు లభిస్తుంది. చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. వ్యాపారాలు ఆశించిన విధంగా రాణిస్తాయి. ఆదాయ మార్గాలు పెరుగుతాయి. వ్యాపారాలలో నూతనోత్సాహంతో ముందుకు సాగుతాయి.





# న్యూయార్క్‌ను మరిపిస్తా

మొదటి పేజీ తరువాయి

చేస్తూ వంద మీటర్ల వెడల్పుతో గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్ల నిర్మాణం కూడా చేపట్టనున్నారు. దీనిలో భాగంగానే సీఎం రేవంత్ రెడ్డి రావిర్యాల్-ఆమన్‌గల్ గ్రీన్‌ఫీల్డ్ రేడియల్ రోడ్-1కు భూమి పూజ చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడిన ఆయన.. తనకు ఫ్యూచర్ సిటీలో భూములు ఉన్నాయని ప్రచారం, ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. నిజంగా తనకు ఇక్కడ ఎకరం భూమి కూడా లేదని..అలా ఉంటే అందరికి తెలుస్తుంది కదా అని వ్యాఖ్యానించారు. అభివృద్ధిని అడ్డుకోవటానికి తనపై కొందరు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. 'నాకు ఫ్యూచర్ సిటీలో భూములు లేవు. తెలంగాణ అభివృద్ధి కోసమే ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ఫ్యూచర్ సిటీని బెంగళూరుతో కనెక్ట్ చేస్తాం. అమరావతి నుంచి చెన్నైకు బుల్లెట్ ట్రైన్ రాబోతుంది. ఇక్కడి నుంచి కూడా బుల్లెట్ ట్రైన్లు పరుగులు పెట్టిస్తాం. అమరావతికి గ్రీన్ ఫీల్డ్ హైవే నిర్మిస్తాం. ఇక్కడే అనేక కంపెనీలు రాబోతున్నాయి. మరో పదేళ్లు అధికారం ఇవ్వండి.. ఫ్యూచర్ సిటీని, తెలంగాణను ఊహించనంతగా అభివృద్ధి చేస్తాం' అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యనించారు.

### భవిష్యత్తుకు పునాదులు

ముందుతరాల కోసం చంద్రబాబు, వైఎస్సార్ ఆలోచించారని రేవంత్ నొక్కిచెప్పారు. అందువల్లే హైటెక్ సిటీ, శంషాబాద్ ఎయిర్‌పోర్టు, ఓఆర్ఆర్ వచ్చాయని గుర్తుచేశారు. గతం నుంచి భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని సూచించారు. ఓ మంచి ఆలోచనతో ఈ అభివృద్ధి కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని చెప్పుకొచ్చారు. ఇంకెన్నాళ్లు విదేశాల గురించి మాట్లాడుకుంటాం? అని ప్రశ్నించారు. పదేళ్ల సమయం ఇవ్వండి.. న్యూయార్క్‌ను మరిపించే నగరం కడతానని పేర్కొన్నారు.

### నిజాం కాలంలో సికింద్రాబాద్ అభివృద్ధి

'మంచి సంకల్పంతో తలపెట్టిన ఈ భారత్ ఫ్యూచర్ సిటీ ప్రారంభోత్సవానికి వరుణదేవుడు కూడా సహకరించాడు. ఆనాడు కులీకుతుబ్ షా హైదరాబాద్ నగరానికి అంకురార్పణ చేశారు. నిజాం కాలంలో సికింద్రాబాద్‌ను అభివృద్ధి చేశారు. ఆ తర్వాత ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్, సిలికాన్ వ్యాలీ అభివృద్ధి జరిగింది. గతం నుంచి మనం నేర్చుకోవలసింది ఎంతో ఉంది. మన భవిష్యత్ తరాల కోసం ఫ్యూచర్ సిటీని నిర్మించుకోవాల్సిన అవసరం ఉంది. ప్రపంచ నగరాలు భారత్ ఫ్యూచర్ సిటీ గురించి చర్చించుకునేలా నగరాన్ని అభివృద్ధి చేసుకుందాం. ఒక గొప్ప నగరాన్ని నిర్మించడానికి ఉండాల్సిన అర్హతలన్నీ భారత్ ఫ్యూచర్ సిటీకి ఉన్నాయి. దక్షిణ భారతదేశంలో పోర్టు లేని రాష్ట్రం తెలంగాణ ఒక్కటే. ఫ్యూచర్ సిటీ నుంచి మచిలీపట్నం గ్రీన్ ఫీల్డ్ హైవేలో డ్రై పోర్ట్ ఏర్పాటు చేసుకోబోతున్నాం. ఫ్యూచర్ సిటీ నుంచి అమరావతి వరకు బుల్లెట్ ట్రైన్ ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వం అంగీకరించింది. ఫ్యూచర్ సిటీలో అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్ ఏర్పాటు చేయబోతున్నాం' అని సీఎం రేవంత్‌రెడ్డి తెలిపారు.

### అదే మా లక్ష్యం

'రాబోయే పదేళ్లలో ప్రపంచంలో ఉండే ఫార్చ్యూన్ 500 కంపెనీలు ఈ భారత్ ఫ్యూచర్ సిటీలో ఉండాలన్నదే మా లక్ష్యం. ఫ్యూచర్ సిటీని ఒక గొప్ప నగరంగా తీర్చిదిద్దడానికి ప్రభుత్వం ప్రణాళికలు వేస్తోంది. ఇందుకు మీ అందరి సహకారం ఉండాలి.. చిన్న చిన్న సమస్యలు ఉంటే పరిష్కరించుకుందాం. ప్రభుత్వం ఉదారంగా మిమ్మల్ని ఆదుకునేందుకు సిద్ధంగా ఉంది. నేను కూర్చుని మీ సమస్యలను పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నా. రాజకీయ పార్టీల ఉచ్చులో పడి కోర్టులకు వెళ్లి నష్టపోవద్దు. తక్షణమే మీ సమస్యలను పరిష్కరించాలని మా అధికారులను ఆదేశిస్తున్నాను. అందరికీ న్యాయం చేయాలనేదే మా ప్రయత్నం. డిసెంబర్‌లో ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ భవనం, స్కిల్ యూనివర్సిటీని పూర్తి చేస్తాం. అప్పుడు నెలకు మూడుసార్లు ఇక్కడికే వచ్చి ఇక్కడి నుంచి కార్యకలాపాలు నిర్వహిస్తాం. ప్రపంచంలో ఎవరూ ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు వచ్చినా ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయంలోనే కూర్చుని మాట్లాడుతా. ప్రపంచాన్ని ఇక్కడికే రప్పిస్తా. సింగరేణి కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఇక్కడ పది ఎకరాలు కేటాయించాలని మల్లు భట్టి విక్రమార్క, శ్రీధర్ బాబుకు సూచన చేస్తున్నాను. 2026 డిసెంబర్‌లోగా ఆ కార్యాలయ నిర్మాణం పూర్తిచేసుకునేలా చూడాలి' అని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు శ్రీధర్ బాబు, అడ్లూరి లక్ష్మణ్, సీఎం సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# వోకల్ ఫర్ లోకల్

మొదటి పేజీ తరువాయి

తనను యుద్ధ ఖైదీగా పరిగణించాలని, తనను, తన సహచరులను కాల్చి చంపాలని బ్రిటిష్ వారికి లేఖ రాశారు. ఆయనను యువతరానికి ప్రేరణగా అభివర్ణించారు. భగత్ సింగ్ మానవత్వం, ప్రజల పట్ల సున్నితత్వాన్ని ఆయన ప్రశంసించారు. ప్రముఖ గాయని లతా మంగేష్కర్ జయంతి సందర్భంగా ప్రధానమంత్రి ఆమెను స్మరించుకున్నారు. లతా దీదీ పాటలు ప్రతి ఒక్కరి హృదయాలను తాకాయని, ముఖ్యంగా ఆమె దేశభక్తి గీతాలు ప్రజలను తీవ్రంగా ప్రభావితం చేశాయని అన్నారు. నావికా సాగర్ పరిక్రమ సందర్భంగా భారత నావికాదళానికి చెందిన ఇద్దరు ధైర్యవంతులైన అధికారులు పరాక్రమాన్ని, దృఢ సంకల్పాన్ని ప్రదర్శించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. ఈ ఇద్దరు ధైర్యవంతులైన అధికారులను 'మన్ కీ బాత్' శ్రోతలకు పరిచయం చేయాలనుకుంటున్నానన్నారు. ఒకరు లెఫ్టినెంట్ కమాండర్ దిల్నా, మరొకరు లెఫ్టినెంట్ కమాండర్ రూపా పేర్లను ప్రధాని మోదీ వివరించారు. దేశ పౌరులందరికీ దీపావళి శుభాకాంక్షలు తెలిపారు ప్రధానమంత్రి. అలాగే దేశవ్యాప్తంగా ఘనంగా జరుగుతున్న ఛత్ పూజకు సంబంధించిన ఒక ప్రధాన ప్రయత్నంలో భారత ప్రభుత్వం కూడా నిమగ్నమై ఉందని తెలియజేయడానికి సంతోషంగా ఉన్నాను. ఛత్ మహాపర్వాన్ని యునెస్కో అగోచర సాంస్కృతిక వారసత్వ జాబితాలో చేర్చడానికి భారత ప్రభుత్వం కృషి చేస్తోంది. ఛత్ పూజను యునెస్కో జాబితాలో చేర్చిన తర్వాత, ప్రపంచంలోని ప్రతి మూలలోని ప్రజలు దాని గొప్పతనాన్ని, దైవత్వాన్ని అనుభవించగలుగుతారు" అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. మన పండుగలు భారతదేశ సంస్కృతిని సజీవంగా ఉంచుతాయన్నారు. ఛత్ పూజ అనేది దీపావళి తర్వాత వచ్చే పవిత్రమైన పండుగ. సూర్యభగవానుడికి అంకితం చేసిన ఈ గొప్ప పండుగ చాలా ప్రత్యేకమైనది. ఈ పండుగ సమయంలో, మనం అస్తమించే సూర్యుడికి ప్రార్థనలు చేసి పూజిస్తారు. ఛత్ దేశంలోని వివిధ ప్రాంతాలలో మాత్రమే జరుపుకుంటారు. దాని వైభవం ప్రపంచవ్యాప్తంగా కూడా కనిపిస్తుంది. నేడు, ఇది ప్రపంచ పండుగగా మారుతోందని ప్రధాని మోదీ అన్నారు. అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు.

# రేవంత్ నల్లమల పిల్లి

మొదటి పేజీ తరువాయి

గుర్తు చేశారు. ఆ సమయంలో, రాయలసీమ ఎమ్మెల్యే ఒకరు, కేసీఆర్ బ్లాక్ మెయిల్ చేస్తున్నారని, ప్రభుత్వం మీద ఒత్తిడి చేస్తున్నారని అన్నారు. అంతేకాక, తూములు కిందకు దించితే వాటిని బాంబులతో బద్దలు కొడతామని హెచ్చరించినప్పుడు, నిజమైన పులి అయిన కేసీఆర్ వెంటనే స్పందించి, ఆర్డీఎస్ తూముల వద్దకు అడుగు పెడితే, అక్కడే ఉన్న సుంకేశుల బరాజ్‌ను వెయ్యి బాంబులతో తూనాతునకలు చేస్తామని హెచ్చరించారని కేటీఆర్ పేర్కొన్నారు. మరి నల్లమల పులి అని చెప్పుకునే రేవంత్ రెడ్డికి ఆ దమ్ము, ఆ తెగువ లేదా అని కేటీఆర్ నిలదీశారు. పాలమూరు ఎండిపోయే పరిస్థితి వస్తే, నల్లగొండకు చుక్క నీరు రాని పరిస్థితి వస్తే, మనకు కేఎల్ఐ లిఫ్ట్, పాలమూరు ఎత్తిపోతల, శ్రీశైలంలోకి కృష్ణా రాకపోయినా పైకి నీళ్లు తెచ్చుకునే అవకాశం ఎక్కడిదని ఆలోచించాలని ప్రజలను కోరారు. ఆల్మట్టి ఎత్తుపై రాహుల్ గాంధీ, రేవంత్ రెడ్డి మాట్లాడారు కానీ, తెలంగాణ ప్రయోజనాల కోసం తిరిగి కొట్లాడేది మాట్లాడేది ఒక్క కేసీఆర్ మాత్రమే అని కేటీఆర్ స్పష్టం చేశారు. "కేసీఆర్ దండుగా ఈ అచ్చంపేట గడ్డ మీద నుంచి రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడుగుతున్నాం. ఆల్మట్టిని ఆపే దమ్ముందా? లేదంటే ఈ గులాబీ దండు బయల్దేరి ఆల్మట్టిని అడ్డుకోవాలా?" అని ఆయన సవాల్ విసిరారు. "మీ ప్రభుత్వానికి దమ్ము తెగింపు ఉంటే, రాహుల్ గాంధీ వద్దకు కర్ణాటక సీఎంను పిలిపించి, ఆల్మట్టి ఎత్తును విరమించుకోవాలని డిమాండ్ చేయండి. దాన్ని వెంటనే ఆపేయండి. ఆ దమ్ము నల్లమల పులికి ఉందా?" అని రేవంత్ రెడ్డిని కేటీఆర్ సూటిగా నిలదీశారు.

## 30నే సద్దుల బతుకమ్మ స్పష్టం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): బతుకమ్మ పండుగ మంగళవారం రావడంతో మంగళవారం పూట ఆడబిడ్డ(బతుకమ్మ)ను గంగమ్మ ఒడికి చేర్చాలా? అన్న సంశయం చాలా మందిలో నెలకొంది. దానికి బదులుగా సోమవారం సద్దుల బతుకమ్మ పండుగను నిర్వహించవచ్చా? లేదా? అన్న అనుమానాలకు తెలంగాణ ప్రభుత్వం తెరదించింది. బతుకమ్మ పండుగ తేదీపై కీలక ప్రకటన చేసింది. ఈనెల 30వ తేదీ మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా సద్దుల బతుకమ్మ పండుగను జరుపుకోవాలని అధికారిక ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా అన్ని జిల్లాల కలెక్టర్లు, స్థానిక అధికారులు ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేసింది.

## కరూర్ మృతుల కుటుంబాలకు విజయ్ రూ.20 లక్షలు

మొదటి పేజీ తరువాయి

విషాద ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు రూ. 20 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు విజయ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇదే ఘటనలో గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి రూ. 2 లక్షల ఆర్థిక సాయం అందజేయనున్నట్లు వెల్లడించారు. తాను ప్రకటించిన ఈ మొత్తం వారి కుటుంబాల్లో వెలుగులు నింపలేదని, వారికి జరిగిన నష్టాన్ని పూడ్చలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు తాను, తన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని విజయ్ హామీ ఇచ్చారు.

## గ్రూప్-2 ఫలితాలు విడుదల

**అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో మెరిట్ జాబితా**

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): గ్రూప్-2 ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న లక్షలాది మంది అభ్యర్థుల నిరీక్షణకు తెరపడింది. 2022 నోటిఫికే షన్‌కు సంబంధించిన 783 గ్రూప్-2 పోస్టుల తుది ఫలితాలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) ఆదివారం ప్రకటించింది. ఇందులో ఒక పోస్టు భర్తీ కాలేదు. 2024 డిసెంబర్ 15, 16 తేదీల్లో జరిగిన రాత పరీక్షలకు సుమారు 2.5 లక్షల మందికి పైగా హాజరయ్యారు. ఈ ఏడాది మార్చి 11న జనరల్ ర్యాంకింగ్ జాబితాను విడుదల చేసిన కమిషన్, ఆ తర్వాత ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షలు పూర్తి చేసింది. అభ్యర్థులు ఇచ్చిన ఆప్షన్లు, మెరిట్ ర్యాంకులు, రిజర్వేషన్ల ఆధారంగా తుది మెరిట్ జాబితాను రూపొందించింది. ఈ పరీక్షల్లో 600 మార్కులకు గాను అత్యధికంగా 447.08 మార్కులు నమోదైనట్లు కమిషన్ వెల్లడించింది. ఈ నోటిఫికేషన్ ద్వారా అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్, సబ్-రిజిస్ట్రార్ గ్రేడ్-2, మున్సిపల్ కమిషనర్ గ్రేడ్-3, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వంటి పోస్టులను భర్తీ చేయనున్నారు. ఎంపికైన వారికి దసరాకు ముందే నియామక పత్రాలు అందజేయాలని కమిషన్ లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఫలితాల విడుదలపై టీజీపీఎస్సీ చైర్మన్ బుర్రా వెంకటేశం మాట్లాడుతూ, పరీక్షలు నిర్వహించిన 10 నెలల వ్యవధిలోనే తుది ఫలితాలు ఇచ్చామని, గ్రూప్-1 వివాదం లేకపోయి ఉంటే ఫలితాలు మరింత తొందరగా వచ్చేవని తెలిపారు. ఎంపికైన అభ్యర్థుల జాబితా, కటాఫ్ మార్కుల వివరాలు అధికారిక వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయని, అభ్యర్థులు హాల్ టికెట్ నంబర్‌తో ఫలితాలను చూసుకోవచ్చని పేర్కొన్నారు.


# నేడు 'స్థానిక' నోటిఫికేషన్?

మొదటి పేజీ తరువాయి

చేయనుందని తెలుస్తోంది. ఇప్పటికే జడ్పీచైర్మన్, జడ్పీటీసీ, ఎంపీపీ, ఎంపీటీసీ, సర్పంచు, వార్డు స్థానాలకు రిజర్వేషన్ల కేటాయింపు ప్రక్రియను అధికార యంత్రాంగం పూర్తి చేసింది. ఎన్నికలను శాంతియుతంగా నిర్వహించేందుకు ఎక్సైజ్, పోలీసు, రెవెన్యూ, పంచాయతీరాజ్ శాఖలతో పాటు ఇతర శాఖల అధికారులతో ఎన్నికల సంఘం అధికారులు సమావేశాలు నిర్వహించారు. ఎన్నికల నిర్వహణకు సర్వసన్నద్ధతతో ఉంది. ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ లభించడంతో సోమవారం ఉదయం స్థానిక ఎన్నికల నోటిఫికేషన్ జారీకి సిద్ధమైనట్లుగా విశ్వసనీయంగా తెలిసింది. అయితే, శనివారం హైకోర్టు ధర్మాసనం నుంచి ఎదురైన ప్రశ్నలకు నోటిఫికేషన్ తర్వాత కూడా విచారణలో బదులివ్వాలని ప్రభుత్వం నిర్ణయానికి వచ్చినట్లుగా తెలిసింది. ఈ మేరకు న్యాయ నిపుణుల సలహా కూడా తీసుకున్నట్లు సమాచారం. న్యాయ నిపుణుల సలహా మేరకు ఎన్నికలకు వెళ్లడమే సరైందని రేవంత్ సర్కారు భావిస్తున్నట్లు తెలుస్తోంది. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తీసుకొచ్చిన జీవోకు గెజిట్ లేదని, బీసీ రిజర్వేషన్ల బిల్లు గవర్నర్ ఆమోదానికి పంపడం..పెండింగ్‌లో ఉండగా అంత హడావుడిగా ఎన్నికలకు వెళ్లడమెందుకంటూ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన విషయం తెలిసిందే. ప్రభుత్వ వాదనలు విన్న తర్వాత హైకోర్టు అక్టోబర్ 8కి విచారణను వాయిదా వేసిన విషయం తెలిసిందే. విచారణ చేపట్టే వరకు స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ ఇవ్వకుండా ఆగుతారా అంటూ కూడా ధర్మాసనం ప్రశ్నించింది. నోటిఫికేషన్ ఇచ్చిన తర్వాత కూడా విచారణను కొనసాగించవచ్చని కూడా ఏజీ బదులివ్వడంతో.. ఈ అంశంపై స్టే ఇవ్వకుండానే హైకోర్టు ధర్మాసనం అక్టోబర్ 8వ తేదీ వరకు విచారణను వాయిదా వేసింది. నోటిఫికేషన్ కంటే ముందే పిటిషన్లు దాఖలైన నేపథ్యంలో నోటిఫికేషన్‌తో సంబంధం లేకుండా మెరిట్‌పై విచారణ చేపడతామని స్పష్టం చేసింది. దసరా సెలవుల తర్వాత ఈ పిటిషన్లు రెగ్యులర్ రోస్టర్ కలిగిన ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వస్తాయని కూడా తెలిపింది. ప్రస్తుతానికి ఎలక్షన్ నోటిఫికేషన్ పై గానీ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు సంబంధించిన జీవో 9పై గానీ హైకోర్టు ఎలాంటి స్టే విధించలేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తే మొత్తం రిజర్వేషన్లు 50 శాతాన్ని మించిపోతాయని, ఇది సుప్రీంకోర్టు తీర్పులతో పాటు పంచాయతీరాజ్ చట్టానికి వ్యతిరేకమని పేర్కొంటూ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా మూడుచింతలపల్లి మండలం కేశవాపూర్‌కు చెందిన బి.మాధవరెడ్డి, ఎస్.రమేశ్ తదితరులు హైకోర్టు శనివారం రెండు హౌజ్‌మోషన్ పిటిషన్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లపై జస్టిస్ అభినందన్‌కుమార్ షావిలి, జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాదులు మయూర్‌రెడ్డి, జె.ప్రభాకర్ వాదనలు వినిపించారు. అయితే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించే జీవోకు చట్టబద్ధత లేదని, గవర్నర్ వద్ద బిల్లు పెండింగ్‌లో ఉండగా జీవో ఎలా జారీ చేస్తారంటూ అటార్నీ జనరల్‌ను ప్రశ్నించిన విషయం తెలిసిందే. గవర్నర్ దగ్గర బిల్లు పెండింగ్‌లో ఉన్నప్పుడు జీవో ఎలా ఇస్తారు..? 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఉండకూడదన్న విషయం తెలియదా..? అంటూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కేటాయిస్తూ జారీ చేసిన జీవోను హైకోర్టులో మరోసారి సవాల్ చేశారు రెడ్డి జాగృతి మాధవరెడ్డి. జీవోను రద్దు చేయాల్సిందేనంటూ ఆయన తరుపు లాయర్ వాదనలు వాదించారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మూడు తీర్పులనూ హైకోర్టులో ప్రస్తావించారు.

### వెనక్కి తగ్గొద్దు

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో వెనక్కి తగ్గొద్దన్న ఆలోచనతో ఉన్న రేవంత్ సర్కారు..న్యాయపరమైన చిక్కులేమైనా ఎదురుతాయా అన్న సమాలోచనలు చేస్తోంది. వాస్తవానికి ఆదివారం సాయంత్రం నోటిఫికేషన్ విడుదలవుతుందన్న ఊహాగానాలు వినిపంచినా.. దీనిపై ఒకట్రెండు రోజులు ఆగుదామా..? ఆలోచనలు చేసినా చివరికి ఎన్నికల నిర్వహణకే మొగ్గు చూపినట్లు సమాచారం. గవర్నర్ దగ్గర బిల్లు ఉన్నప్పుడు జీవో ఇవ్వడం సరికాదని కూడా హైకోర్టు సూచిచింది. అవసరమైతే మరో 2, 3నెలల సమయం కోరుతూ అఫిడవిట్ వేసుకోవాలని సూచించింది. దీనిపై స్పందించిన ఏజీ.. ప్రభుత్వ నిర్ణయానికి రెండ్రోజుల సమయం కావాలని కోరింది. అలాగే నోటిఫికేషన్ ఎప్పుడు ఇస్తారని ఈసీని హైకోర్టు అడగగా%ో% ఏ క్షణంలోనైనా నోటిఫికేషన్ ఇస్తామని ఎన్నికల సంఘం తరుపు న్యాయవాది బదులిచ్చారు. దీంతో ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలనే బలమైన పట్టుదలతో ఉన్నట్లు స్పష్టం అవుతోంది.



# బతుకమ్మ కుంట జాతికి అంకితం

**అట్టహాసంగా ప్రారంభించిన సీఎం రేవంత్**

అంబర్‌పేట, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్మించిన బతుకమ్మ కుంటను సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. అంబర్‌పేటలో కబ్జాలకు గురైన బతుకమ్మ కుంటను స్వాధీనం చేసుకున్న హైడ్రా.. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దింది. ఆదివారం మంత్రులు, ప్రభుత్వ ఉద్యోగులు, వేల మంది ఆడపడుచులు, కార్యకర్తల కోలాహలం నడుమ కొబ్బరికాయ కొట్టి బతుకమ్మ కుంటను ప్రజలకు అంకితం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు సీతక్క, పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ సీనియర్ నేత వీహెచ్ హనుమంతరావు, హైడ్రా కమిషనర్ రంగనాథ్, విమలక్క, గంగవ్వ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బతుకమ్మ కుంటలో హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి మొదటి బతుకమ్మ వేశారు. బతుకమ్మ కుంట వెనుక అన్నీ తానై నిలిచిన హైడ్రా కమిషనర్ రంగనాథ్ మాట్లాడుతూ.. బతుకమ్మ కుంట ప్రారంభం హైడ్రాకు అతి పెద్ద అచీవ్ మెంట్ అన్నారు. ఈ సందర్భంగా విమలక్క బతుకమ్మ పాట పాడి అలరించారు. వాస్తవానికి బతుకమ్మ కుంటను ఈ నెల 26 నే ప్రారంభించాల్సి ఉండగా, ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా వాయిదా వేశారు. ఆదివారం అంగరంగ వైభవంగా ప్రారంభించారు. ఒకప్పుడు ఆక్రమణలతో సగమైన ఈ బతుకమ్మ కుంట హైడ్రా వచ్చాక తిరిగి పునరుజ్జీవనం పోసుకుంది. 7కోట్ల40 లక్షల రూపాయలతో బతుకమ్మ కుంట సుందరీకరణ చేపట్టింది రాష్ట్రప్రభుత్వం. 5 ఎకరాల 15 గుంటల స్థలంలో బతుకమ్మ కుంట పేరుతో వర్టికల్ గార్డెన్ ఏర్పాటు చేశారు. ఇన్ లెట్, ఔట్ లెట్, దీంతోపాటు చుట్టూ వాక్ వే, వాక్ వే చుట్టూ చెట్లు నాటి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు అధికారులు. చిల్డ్రన్ ప్లే ఏరియా, ఓపెన్ జిమ్ ఏర్పాటుతో అందరిని ఆకర్షిస్తోంది.



## రద్దీకి తగ్గట్లు బస్సులు

**అధికారులకు మంత్రి పొన్నం ఆదేశాలు**

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): బతుకమ్మ, దసరా పండుగల నేపథ్యంలో ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచండి అని ఆర్టీసీ అధికారులకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు జారీ చేశారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదివారం టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. సద్దుల బతుకమ్మ, దసరా పండుగ సందర్భంగా సొంతూళ్లకు వెళ్లే వారికి రవాణాపరమైన ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్‌లో ప్రధాన రద్దీ ప్రాంతాలైన ఉప్పల్, ఎల్బీనగర్, ఆరాంఘర్, తదితర ప్రాంతాలకు ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ప్రతి బస్ స్టేషన్‌లోనూ ప్రత్యేక అధికారిని నియమించాలని, అక్కడ రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఆర్ఎంలు, డిప్యూటీ ఆర్ఎంలు, డీఎంలతో పాటు ఉన్నతాధికారులందరూ క్షేత్రస్థాయిలో ఉంటూ.. 97 డిపోలు 340 బస్ స్టేషన్లు సమన్వయం చేసుకొని ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని ఆదేశించారు. దసరా నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా 7754 స్పెషల్ బస్సులను టీజీఎస్ఆర్టీసీ నడుపుతున్నట్లు మంత్రి దృష్టికి ఆర్టీసీ ఉన్నతాధికారులు తీసుకెళ్లారు. సద్దుల బతుకమ్మ ఈ నెల 30న, దసరా అక్టోబర్ 2న ఉన్నందున.. ఈ శనివారం నుంచే సొంతూళ్లకు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండే అవకాశముండటంతో ఆ మేరకు ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచామని అధికారులు వివరించారు.

# మరో రెండ్రోజులు వానలే

**హెచ్చరించిన వాతావరణశాఖ**

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): తెలంగాణలో రాబోయే రెండురోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే సూచనలున్నాయని తెలిపింది. పశ్చిమ విదర్భ, పరిసర ప్రాంతాల్లో ఏర్పడిన వాయుగుండం దాదాపు పశ్చిమ దిశకు కదిలి అల్పపీడనంగా బలహీనపడిందని వాతావరణశాఖ పేర్కొంది. ఉపరితల ఆవర్తనం సగటు సముద్రమట్టానికి 7.6కిలోమీటర్ల వరకు విస్తరించి నైరుతి వైపునకు ఎత్తుకు వంగి ఉందని.. ఇది రాబోయే 24గంటల్లో బలహీనపడుతుందని తెలిపింది. ఆదివారం నుంచి మంగళవారం మధ్య మహారాష్ట్ర, దక్షిణ గుజరాత్, సౌరాష్ట్ర మీదుగా పశ్చిమం వైపు కదులుతూ అక్టోబర్ ఒకటి నాటికి గుజరాత్ తీరం వెంబడి ఈశాన్య అరేబియా సముద్రం మీదుగా అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది. సెప్టెంబర్ 30న ఉత్తర అండమాన్ సముద్రంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉందని.. దాని ప్రభావంతో అక్టోబర్ ఒకటిన ఉత్తర, మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం



ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ క్రమంలో తెలంగాణలో ఆదివారం వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్‌ను జారీ చేసింది. సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలోని పలు చోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది. ఇదిలా ఉండగా.. హైదరాబాద్‌లో ఆకాశం సాధారణంగా మేఘావృతమై ఉంటుందని.. పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయని తెలిపింది. ఉరుములు, మెరుపులతో పాటు గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని అంచనా వేసింది. ఉదయం, రాత్రి సమయాల్లో పొగమంచుతో కూడిన పరిస్థితులు నెలకొనే సూచనలున్నాయని చెప్పింది.

# ఠాణాలో కాంగ్రెస్, బీజేపోళ్ల ఫొటోలు

**ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ధ్వజం**

అచ్చంపేట, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై, రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీఆర్ఎస్ సీనియర్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ నిప్పులు చెరిగారు. ఈ రాష్ట్రాన్ని నిలువునా దోచుకుంటున్న కాంగ్రెస్, బీజేపీ నేతల ఫొటోలను పోలీసు స్టేషన్లలో పెట్టాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. అచ్చంపేట నియోజకవర్గంలో బీఆర్ఎస్ ఏర్పాటు చేసిన జన గర్జన సభలో ఆర్ఎస్పీ పాల్గొని ప్రసంగించారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం, కేంద్రంలో ఉన్న బీజేపీ ఎన్ని కుట్రలు చేసినా అచ్చంపేటలో బీజేపీకి, కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలను ఎన్నో కష్టాలు పెడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాల మీద సోషల్ మీడియాలో పోస్టులు పెడితే రేవంత్ రెడ్డి కేసులు పెట్టి, రౌడీషీట్లు ఓపెన్ చేయిస్తున్నాడు.. జైల్లో పడేస్తాడట. పోలీసు స్టేషన్లలో, రౌడీషీట్లలో ఉండాల్సిన వ్యక్తి రేవంత్ రెడ్డి.



ప్రజల పక్షా పోరాడుతున్నా మనం కాదు.. నిలువునా దోచుకుంటున్న కాంగ్రెస్, బీజేపీ నేతల బొమ్మలు పోలీసు స్టేషన్లలో ఉండాలని ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో ఎస్సీ, ఎస్టీ, బీసీల మీద ఘోరాలకు పాల్పడుతున్నారు. దళితులపై అత్యాచారాలు జరిగేది యూపీలోనే అది తెలిసీ బీజేపీలోకి వెళ్లారా..? అని గువ్వల బాలరాజును నిలదీశారు ఆర్ఎస్పీ. మధ్యప్రదేశ్‌లో దళితులపై మూత్రం పోసి అవమానించారు ఈ బీజేపీ నేతలు. రోహిత్ వేములను చంపింది కూడా బీజేపీనే. ఈ కాంగ్రెస్, బీజేపీ రెండు కలిసి మళ్లీ తెలంగాణను దోచుకుని మన భవిష్యత్‌ను నాశనం చేసేందుకు వచ్చాయి. పాలమూరు ఎత్తిపోతల పనులను కేసీఆర్ 90 శాతం పూర్తి చేస్తే, మిగిలిన 10 శాతం పనులను నిధులు ఇవ్వకుండా రేవంత్ రెడ్డి అడ్డగించారు. మరి ఎవరు నిజమైన పాలమూరు బిడ్డ.. రేవంతా..? కేసీఆరా..? చేతులు జోడించి కోరుతున్నా రాబోయే స్థానిక ఎన్నికల్లో కాంగ్రెస్ బీజేపీలను చిత్తుచిత్తుగా ఓడించి మళ్లీ బీఆర్ఎస్ పార్టీని అధికారంలోకి తీసుకురావాలి. బరాబర్ ఈ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను ఓడించాలి అని అచ్చంపేట ప్రజలకు ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు.

# ఎంజీబీఎస్ నుంచి ఆర్టీసీ బస్సులు ప్రారంభం

అఫ్జల్‌గంజ్/హైదరాబాద్, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): బతుకమ్మ, దసరా పండుగలకు సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు శుభవార్త. మూసీకి వరద తగ్గడంతో ఆదివారం మధ్యాహ్నం నుంచి ఆర్టీసీ బస్సులను ఎంజీబీఎస్ నుంచి పునరుద్ధరించారు. తెలంగాణలోని అన్ని జిల్లాలకు వెళ్లాల్సిన బస్సులను అధికారులు అందుబాటులో ఉంచారు. అంతర్ రాష్ట్ర సర్వీసులు కూడా ప్రారంభమయ్యాయి. దీంతో ఆర్టీసీ ప్రయాణికులతో ఎంజీబీఎస్ కిటకిటలాడుతోంది. శుక్రవారం రాత్రి భారీ వరద నేపథ్యంలో ఎంజీబీఎస్ నీట మునిగిన సంగతి తెలిసిందే. దీంతో అదే రోజు రాత్రి 8 గంటల నుంచి ఎంజీబీఎస్‌లో ఉన్న బస్సులను, ప్రయాణికులను అధికారులు ఖాళీ చేయించారు. ఈ క్రమంలో నిన్నటి నుంచి ఆదివారం మధ్యాహ్నం వరకు ఆరాంఘర్, ఉప్పల్, ఎల్బీనగర్, జేబీఎస్, మెహిదీపట్నం వరకే జిల్లా సర్వీసులు రాకపోకలు కొనసాగించాయి.

## కిక్కిరిసిన జేబీఎస్

దసరా పండుగ నేపథ్యంలో సికింద్రాబాద్ జూబ్లీ బస్‌స్టేషన్‌లో రద్దీ పెరిగింది. సెలవులకు పెద్ద ఎత్తున స్వగ్రామాలకు తరలి వెళ్తున్న సందర్భంగా ప్రయాణికులతో జేబీఎస్ కిక్కిరిసింది. ఇటీవల కురిసిన వర్షాల వల్ల ఎంజీబీఎస్‌కు ఉత్తర తెలంగాణ బస్సులు వెళ్లకపోవడంతో.. జేబీఎస్ నుంచి ప్రయాణికుల రద్దీ ఒక్కసారిగా పెరిగింది.

## ప్రమాదంలో ప్రజాస్వామ్యం: ప్రశాంత్ భూషణ్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం/హైదరాబాద్, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): ఎన్నికల సంఘం, దర్యాప్తు సంస్థలు స్వతంత్రను కలిగి ఉంటేనే ప్రజాస్వామ్యం ప్రాణంతో ఉంటుందని సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది ప్రశాంత్ భూషణ్ అన్నారు. ప్రస్తుతం దేశ ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, దానిని కాపాడుకోవాల్సిన అవసరం ఉందని వ్యాఖ్యానించారు. హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన 'ప్రజాస్వామ్యాన్ని రక్షించండి' కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలతో సంబంధం లేకుండా స్వతంత్ర కమిషన్ ఏర్పాటు చేసి ఎన్నికల కమిషన్, ఇన్వెస్టిగేటివ్ ఏజెన్సీలు పని చేయాలని ఆయన సూచించారు. స్వతంత్ర కమిషన్ ఉంటే ఓట్ల చోరీ జరగదని.. ప్రభుత్వాలు ఇన్వెస్టిగేటివ్ ఏజెన్సీలను భయపెట్టి పనులు చేయించుకునే పరిస్థితులు ఉండవని అభిప్రాయపడ్డారు. ప్రజల ఓట్లతో కాకుండా... ఈవీఎంలు విజయాన్ని డిసైడ్ చేస్తున్నాయని, ఈసీ పారదర్శకంగా పనిచేయటం లేదని విమర్శించారు. మత రాజకీయాలు చేస్తూ.. దేశంలో దొంగలు రాజ్యమేలుతున్నారని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మండిపడ్డారు. పేదవారి కోసం పోరాడిన వారు జైళ్లలో ఉంటున్నారని.. చంపిన వారు రాజ్యాన్ని ఏలుతున్నారని విమర్శించారు.


# మైటా ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): మలేషియా తెలంగాణ అసోసియేషన్ (మైటా) ఆధ్వర్యంలో ఆదివారం 12వ వార్షికోత్సవ బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మలేషియాలో ఇండియన్ హై కమిషనర్ బీఎన్ రెడ్డి హాజరయ్యారు. గత పన్నెండేళ్లుగా మైటా చేస్తున్న సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబింబించేలా పండుగల సందర్భంగా నిర్వహిస్తున్న కార్యక్రమాలను బీఎన్ రెడ్డి అభినందించారు. సరిహద్దులు దాటి వచ్చినా కూడా మన సాంప్రదాయాన్ని ఇంత పెద్దఎత్తున 150 పైగా బతుకమ్మలు, 2వేల మంది మహిళలు హాజరవ్వడాన్ని అయన కొనియాడారు. ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి మైటా చేస్తున్న కార్యక్రమాలకు తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం తరఫున సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమానికి మాజీ ఆసియా పసిఫిక్ సుందరి రష్మి ఠాకూర్ హాజరయ్యారు. జానపద గాయని నాగలక్ష్మి పాటలతో అలరించారు. డాన్స్ మాస్టర్ నరేశ్ ఆధ్వర్యంలో చిన్నారులు, మహిళలు తెలంగాణ జానపద పాటలకు చేసిన నృత్యప్రదర్శన ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. మైటా ప్రెసిడెంట్ సైదం తిరుపతి, వైస్ ప్రెసిడెంట్ చిరుత చిట్టిబాబు, మహిళా ప్రెసిడెంట్ కిరణ్మయి, జనరల్ సెక్రటరీ సందీప్ గౌడ్, జాయింట్ సెక్రటరీ సత్యనారాయణ రావు, ట్రెజరర్ సందీప్ కుమార్ లగిశెట్టి, జాయింట్ ట్రెజరర్ సుందర్ రెడ్డి, యూత్ ప్రెసిడెంట్ సంతోష్ దాసరాజు, యూత్ వైస్ ప్రసిడెంట్ శివ తేజ, ఎగ్జిక్యూటివ్ సభ్యులు పాల్గొన్నారు.

# కొట్టుకుపోయిన ఏడుపాయల గర్భగుడి షెడ్డు

మెదక్, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): తెలంగాణలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నదులు, వాగులు ఉగ్రరూపం దాల్చాయి. ముఖ్యంగా మెదక్ జిల్లాలోని చారిత్రక ఏడుపాయల వన దుర్గమ్మ ఆలయం వద్ద పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. మంజీరా నదికి పోటెత్తిన భారీ వరద కారణంగా ఆలయ ప్రాంతం జలమయమైంది. ఎగువ ప్రాంతాల నుంచి వరద ప్రవాహం పెరగడంతో ఏడుపాయల ఆలయం గత 15 రోజులుగా వరద నీటిలోనే చిక్కుకుపోయింది. సింగూరు ప్రాజెక్టు నుంచి ఏకంగా ఒక లక్షా 20 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో మంజీరా నదికి ప్రమాదకర స్థాయిలో వరద పోటెత్తింది. గత పదేళ్లలో ఏడుపాయల వద్ద ఇంతటి భీకర వరద రాలేదని స్థానికులు చెబుతున్నారు. వరద ప్రవాహం తీవ్రతకు ఆలయ ప్రాంగణంలో ఉన్న నిర్మాణాలకు భారీ నష్టం వాటిల్లింది. ముఖ్యంగా గర్భగుడి మండపం పైభాగంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన షెడ్డు పూర్తిగా వరదలో కొట్టుకుపోయింది. అంతేకాకుండా ప్రసాదాల పంపిణీ కేంద్రం షెడ్డు కూడా నది ప్రవాహానికి ధ్వంసమై కొట్టుకుపోవడం ఆందోళన కలిగిస్తోంది. ప్రమాదకర స్థాయిలో నది ప్రవహిస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తమయ్యారు. ప్రస్తుతం ఆలయానికి వెళ్లే మూడు ప్రధాన మార్గాలను పోలీసులు పూర్తిగా మూసివేశారు. భక్తులు ఎవరూ ఆలయ దర్శనానికి రావద్దని అధికారులు కఠినంగా హెచ్చరిస్తున్నారు. కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి నుంచి ఏడుపాయలకు వెళ్లే మొదటి వంతెన వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. అత్యవసరమైతే భక్తులు పాపన్నపేట మండలం నాగ్సాన్ పల్లి మీదుగా మాత్రమే ప్రత్యామ్నాయ మార్గంలో వెళ్లాలని కొల్చారం పోలీసులు సూచించారు. మంజీరా నది ఉధృతి కొనసాగుతుండటంతో అధికారులు, పోలీసులు పరిస్థితిని నిశితంగా పర్యవేక్షిస్తున్నారు.





## జూరాల 39 క్రస్టు గేట్లు ఎత్తివేత

గద్వాల, సెప్టెంబర్ 28 (ఈవార్తలు): జూరాల జలాశయానికి భారీ వరద కొనసాగుతున్నది. దీంతో అధికారులు 39 క్రస్టు గేట్లను ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి ప్రాజెక్టులోకి 4.85 లక్షల క్యూసెక్కుల వరద వస్తుండగా, 4.94 లక్షల క్యూసెక్కుల నీరు బయటకు వెళ్తున్నది. జూరాల పూర్తిస్థాయి నీటిమట్టం 318.51 మీటర్లు. ప్రస్తుతం 317.370 మీటర్ల వద్ద నీరు ఉన్నది. ప్రాజెక్టు గరిష్ట నీటి నిల్వ 9.657 టీఎంసీలు కాగా, ఇప్పుడు 7.407 టీఎంసీల నీరు ఉంది. నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు వరద ప్రవాహం భారీగా పెరిగింది. దీంతో 26 గేట్లను 15 అడుగుల మేర ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్‌కు 4.39 లక్షల క్యూసెక్కులు వస్తుండగా, 5.83 లక్షల క్యూసెక్కుల వరద బయటకు వెళ్తున్నది. స్పిల్ వే ద్వారా 5.41 లక్షల క్యూసెక్కులు వెళ్తుండగా, పవర్ హౌస్‌కు 33,373 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ పూర్తిస్థాయి నీటిమట్టం 590 అడుగులు కాగా, ప్రస్తుతం 586.70 అడుగుల వద్ద నీటిమట్టం ఉన్నది. ప్రాజెక్టులో 312.04 టీఎంసీల నీటిని నిల్వ చేయవచ్చు. ఇప్పుడు 303.94 టీఎంసీల నీరున్నది.

## సోషల్ వాణి



మూసీ తన ఒడ్డులెంతవరకో చూపింది తనలో ఉన్న ఆక్రమణలని చూపింది. ఏడాదికి ఒకసారి ఇలాగా దూకమ్మా కబ్జాలన్నీ మింగేయమ్మా.

- పులికొండ సుబ్బాచారి (నటుడు ప్రియదర్శి తండ్రి)

# గోర్లు పీకుతూ.. వేళ్లు నరికేస్తూ..




**ముగ్గురు యువతుల దారుణ హత్య**

**అర్జెంటీనాలో డ్రగ్స్ గ్యాంగ్ దారుణం**

బ్యూనస్: అర్జెంటీనా రాజధాని బ్యూనస్ ఎయిర్స్‌లో అత్యంత దారుణమైన ఘటన చోటుచేసుకుంది. ముగ్గురు యువతులను చిత్రహింసలు పెట్టి హత్య చేయడమే కాకుండా, ఈ ఘోరకృత్యాన్ని సోషల్ మీడియాలో ప్రత్యక్ష ప్రసారం చేయడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ పాశవిక చర్యకు వ్యతిరేకంగా శనివారం వేలాది మంది ప్రజలు వీధుల్లోకి వచ్చి నిరసనలు తెలిపారు. బాధిత కుటుంబసభ్యులతో కలిసి పార్లమెంట్ వరకు భారీ ర్యాలీ నిర్వహించి, దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బ్యూనస్ ఎయిర్స్ శివారు ప్రాంతానికి చెందిన మోరెనా వెర్డి (20), బ్రెండా డెల్ కాస్టిల్లో (20), లారా గుటియెర్రెజ్ (15) అనే ముగ్గురు అమ్మాయిలు ఈ నెల 19న అదృశ్యమయ్యారు. ఐదు రోజుల తర్వాత, బుధవారం ఒక ఇంటి పెరట్లో వారి మృతదేహాలను పోలీసులు పాతిపెట్టిన స్థితిలో కనుగొన్నారు. డ్రగ్స్ ముఠాతో ఉన్న విభేదాలే ఈ హత్యలకు కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. పార్టీ పేరుతో యువతులను ఒక వ్యాన్‌లోకి ఎక్కించుకుని, ఈ దారుణానికి ఒడిగట్టినట్లు తెలిపారు. ఈ కేసు విచారణలో భాగంగా అదుపులోకి తీసుకున్న నిందితుల్లో ఒకరు హత్యను ఇన్‌స్టాగ్రామ్‌లోని ఒక ప్రైవేట్ అకౌంట్‌లో ప్రత్యక్ష ప్రసారం చేసినట్లు వెల్లడించడం అందరినీ దిగ్భ్రాంతికి గురి చేసింది. సుమారు 45 మంది ఈ లైవ్‌ను చూసినట్లు అధికారులు తెలిపారు. "నా దగ్గర డ్రగ్స్ దొంగిలిస్తే ఇలాగే జరుగుతుంది" అని ఒక ముఠా నాయకుడు వీడియోలో హెచ్చరించినట్లు సమాచారం. నిందితులు బాధితుల వేళ్లను నరికి, గోళ్లను పీకి, తీవ్రంగా కొట్టి ఊపిరాడకుండా చేసి చంపారని స్థానిక మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఈ ఘటనపై స్పందించిన జాతీయ భద్రతా మంత్రి పాట్రిసియా బుల్రిచ్ మాట్లాడుతూ ఇప్పటివరకు ముగ్గురు పురుషులు, ఇద్దరు మహిళలతో సహా ఐదుగురిని అరెస్ట్ చేసినట్లు శుక్రవారం ప్రకటించారు. ఐదో నిందితుడిని బొలీవియా సరిహద్దు నగరమైన విల్లాజోన్‌లో పట్టుకున్నట్లు తెలిపారు. ఈ హత్యలకు ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న 20 ఏళ్ల పెరూ దేశస్థుడి కోసం పోలీసులు గాలిస్తున్నారు. మరోవైపు, ఈ లైవ్ స్ట్రీమింగ్ తమ ప్లాట్‌ఫామ్‌పై జరిగిందనడానికి ఎటువంటి ఆధారాలు లభించలేదని ఇన్‌స్టాగ్రామ్ మాతృ సంస్థ 'మెటా' ఒక ప్రకటనలో తెలిపింది. ఈ దారుణమైన నేరంపై దర్యాప్తు చేస్తున్న అధికారులకు తాము పూర్తిగా సహకరిస్తున్నామని మెటా ప్రతినిధి చెప్పారు. నిరసనలో పాల్గొన్న బాధితుల కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. "జంతువులతో కూడా ఇంత క్రూరంగా ప్రవర్తించరు. మాకు న్యాయం జరగాలి" అంటూ వారు ఆవేదన వ్యక్తం చేశారు.

# అండమాన్‌లో గ్యాస్ నిధులు

**సముద్రంలో సహజ వాయువు నిక్షేపాలు గుర్తింపు.. ప్రభుత్వ రంగ సంస్థ ఆయిల్ ఇండియా అన్వేషణ సఫలం**

**అండమాన్ తూర్పు తీరానికి 17 కి.మీ. దూరంలో గ్యాస్ జాడలు**

**భారీగా నిక్షేపాలు ఉంటాయని నిపుణుల అంచనా**



న్యూఢిల్లీ: భారత ఇంధన రంగంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. అండమాన్ సముద్ర గర్భంలో సహజ వాయువు నిక్షేపాలను కనుగొన్నట్లు ప్రభుత్వ రంగ సంస్థ ఆయిల్ ఇండియా లిమిటెడ్ (ఓఐఎల్) అధికారికంగా ప్రకటించింది. అండమాన్ దీవుల తూర్పు తీరానికి సుమారు 17 కిలోమీటర్ల దూరంలో చేపట్టిన అన్వేషణలో ఈ గ్యాస్ జాడలు లభ్యమయ్యాయి. ఓఐఎల్ తవ్విన ఒక అన్వేషణాత్మక బావిలో 295 మీటర్ల లోతులో గ్యాస్ ఉన్నట్లు కంపెనీ గుర్తించింది. ఈ బావి నుంచి సేకరించిన నమూనాలను ఆంధ్రప్రదేశ్‌లోని కాకినాడ లేబొరేటరీలో పరీక్షించగా, ఇందులో 87 శాతం వరకు మీథేన్ వాయువు ఉన్నట్లు తేలిందని ఓఐఎల్ ఒక ప్రకటనలో తెలిపింది. అయితే, ఈ బావి నుంచి రోజుకు ఎంత గ్యాస్ వెలికితీయవచ్చనే దానిపై స్పష్టత రావాల్సి ఉంది. నిర్దేశించిన ప్రకారం మొత్తం 2,650 మీటర్ల లోతు వరకు తవ్వకాలు పూర్తి చేస్తేనే ఉత్పత్తి సామర్థ్యంపై ఒక అంచనాకు రాగలమని అధికారులు విశ్లేషిస్తున్నారు. అండమాన్ దీవులకు సమీపంలో ఉన్న మయన్మార్, ఇండోనేషియా దేశాల సముద్ర తీరాల్లో ఇప్పటికే భారీ స్థాయిలో చమురు, గ్యాస్ నిక్షేపాలు వెలుగుచూశాయి. ఈ నేపథ్యంలో అండమాన్, నికోబార్ ప్రాంతంలో కూడా గణనీయమైన హైడ్రోకార్బన్ నిల్వలు ఉంటాయని నిపుణులు చాలాకాలంగా అంచనా వేస్తున్నారు. 'ఇండియా హైడ్రోకార్బన్ రిసోర్స్ అసెస్‌మెంట్ స్టడీ' నివేదిక ప్రకారం, ఈ ప్రాంతంలో దాదాపు 37.1 కోట్ల టన్నుల చమురుకు సమానమైన నిక్షేపాలు ఉండే అవకాశం ఉంది. ఈ అంచనాల నేపథ్యంలోనే ప్రభుత్వ రంగ సంస్థలైన ఓఎన్‌జీసీ, ఓఐఎల్ కలిసి రూ.3,200 కోట్ల పెట్టుబడితో ఈ ప్రాంతంలో విస్తృత అన్వేషణ కార్యక్రమాలను చేపట్టాయి. అండమాన్‌లో చమురు, గ్యాస్ నిక్షేపాలు భారీగా ఉండే అవకాశం ఉందని కేంద్ర పెట్రోలియం శాఖ మంత్రి హర్‌దీప్ సింగ్ పురి ఇటీవల వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. తాజా ఆవిష్కరణ ఈ అంచనాలకు మరింత బలాన్ని చేకూరుస్తోంది.



Arattai

# వాట్సాప్‌కు పోటీగా అరట్టై!

చెన్నై: చెన్నైకి చెందిన జోహో కార్పొరేషన్ అభివృద్ధి చేసిన 'అరట్టై' యాప్ ప్రస్తుతం సోషల్ మీడియాలో ట్రెండింగ్‌లో ఉంది. యాపిల్ యాప్ స్టోర్‌లో సోషల్ నెట్‌వర్కింగ్ విభాగంలో ఇది నంబర్ వన్ స్థానంలో నిలిచింది. 'అరట్టై' అంటే తమిళంలో "మాట్లాడటం" అని అర్థం. టెక్ట్స్ మెసేజ్‌లు, వాయిస్/ వీడియో కాల్స్, ఫొటోలు, వీడియోలు, డాక్యుమెంట్లు పంపడం, స్టోరీస్, ఛానల్స్ క్రియేట్ చేయడం ఇలా వ్యక్తిగత మరియు వృత్తిపరమైన అవసరాలకు తగిన ఫీచర్లతో ఈ యాప్‌ను రూపొందించారు. దేశీయ ఉత్పత్తులు, సేవలను వినియోగించాలని ప్రధాని మోదీ పిలుపు మేరకు ఈ యాప్‌ను కేంద్ర మంత్రులు ధర్మేంద్ర ప్రదాన్, అశ్వినీ వైష్ణవ్ ప్రోత్సహిస్తున్నారు. తాజాగా తాను జోహోకు మారుతున్నట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ ప్రకటించారు. మైక్రోసాఫ్ట్ పవర్ పాయింట్ బదులుగా జోహోతోనే తాజా కేబినెట్ ప్రజెంటేషన్ తయారు చేసినట్లు ఆయన తెలిపారు. ఇదే తరహాలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ కూడా ఈ యాప్‌ను ప్రోత్సహిస్తూ ప్రజలకు వాడాలని సూచించారు. అయితే, ప్రస్తుతం అరట్టై యాప్‌లో కాల్స్‌కు మాత్రమే ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ ఉంది. మెసేజ్‌లకు ఈ సదుపాయం లేకపోవడం, గోప్యత గురించి ఆందోళనలకు కారణమవుతోంది. మెసేజ్‌లను థర్డ్ పార్టీ వ్యక్తులు కూడా చూడొచ్చు. వాట్సాప్ లాంటి గ్లోబల్ దిగ్గజానికి ధీటుగా నిలవాలంటే ఈ లోటును భర్తీ చేయాల్సిందేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. అరట్టై స్థానిక యాప్‌గా ప్రస్తుతం ఆదరణ పొందుతోంది. ఎప్పటికప్పుడు అప్‌డేట్‌లు చేసుకుంటూ కొత్త ఫీచర్లు చేర్చుకుంటూ వెళితే వాట్సాప్‌కు ప్రత్యామ్నాయంగా మారొచ్చని నిపుణులు పేర్కొంటున్నారు.

# కరూర్ ఘటనపై నివేదిక పంపండి

**తమిళనాడు ప్రభుత్వానికి కేంద్రం ఆదేశాలు**



న్యూఢిల్లీ: తమిళనాడులోని కరూర్‌లో జరిగిన ఘోర తొక్కిసలాట ఘటనపై కేంద్ర హోం మంత్రిత్వ శాఖ తీవ్రంగా స్పందించింది. నటుడు విజయ్ ఏర్పాటు చేసిన రాజకీయ సభలో జరిగిన ఈ దుర్ఘటనలో 39 మంది ప్రాణాలు కోల్పోవడంపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. ఈ ప్రమాదానికి దారితీసిన పరిస్థితులు, సహాయక చర్యలపై పూర్తి వివరాలతో తక్షణమే నివేదిక సమర్పించాలని తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించింది. శనివారం విజయ్ తన టీవీకే పార్టీ తరఫున నిర్వహించిన బహిరంగ సభకు భారీ సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. సభా ప్రాంగణం జనంతో కిక్కిరిసిపోయిన సమయంలో ఒక్కసారిగా తోపులాట జరిగి తొక్కిసలాటకు దారితీసింది. ఊపిరాడక, కిందపడిపోయి జనం కాళ్ల కింద నలిగిపోవడంతో 39 మంది చనిపోగా, మరో 46 మంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న వెంటనే సీనియర్ మంత్రులు అన్బిల్ మహేశ్ పొయ్యమొళి, మా సుబ్రమణియన్ హుటాహుటిన కరూర్ చేరుకుని సహాయక చర్యలను పర్యవేక్షించారు. క్షతగాత్రులను కరూర్ ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి తరలించారు. వీరిలో ముగ్గురు చిన్నారుల పరిస్థితి విషమంగా ఉందని, వారిని ఐసీయూలో ఉంచి చికిత్స అందిస్తున్నామని అధికారులు తెలిపారు. ఆసుపత్రి ప్రాంగణం బాధితులు, వారి బంధువుల ఆర్తనాదాలతో యుద్ధ వాతావరణాన్ని తలపించిందని స్థానిక అధికారులు పేర్కొన్నారు. అదనపు డీజీపీ (శాంతిభద్రతలు) డేవిడ్సన్ దేవశిర్వతం సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ఈ దుర్ఘటనపై ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ మృతుల కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ. 10 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ. లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని తెలిపారు. బాధితులను పరామర్శించేందుకు, భవిష్యత్ కార్యక్రమాలకు భద్రతా ఏర్పాట్లను సమీక్షించేందుకు సీఎం స్టాలిన్ కరూర్ లో పర్యటించనున్నారు. సభా ప్రాంగణంలో ఉన్నట్లుండి జనం ముందుకు తోసుకురావడంతోనే ఈ ఘోరం జరిగిందని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. భద్రతా వైఫల్యాలు, నిర్వాహకుల లోపాలపై అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ఇటీవలి కాలంలో రాజకీయ సభల్లో జరిగిన అతిపెద్ద విషాదాల్లో ఒకటిగా ఈ ఘటన నిలిచింది.

# నిందితులను వదలం: స్టాలిన్



చెన్నై: తమిళనాడులో నటుడు, టీవీకే అధినేత విజయ్ రాజకీయ సభ పెను విషాదాన్ని మిగిల్చింది. కరూర్ నగరంలో ఆయన నిర్వహించిన బహిరంగ సభలో జరిగిన తొక్కిసలాటలో 38 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటనలో 18 మంది మహిళలు, 10 మంది చిన్నారులు ఉండటం అందరినీ కలచివేస్తోంది. మరో 46 మందికి పైగా తీవ్రంగా గాయపడగా, వారిలో కొందరి పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. శనివారం జరిగిన ఈ సభకు కార్యకర్తలు, అభిమానులు ఊహించని రీతిలో భారీ సంఖ్యలో తరలివచ్చారు. విజయ్ వేదికపై ప్రసంగిస్తున్న సమయంలో జనాన్ని నియంత్రించడం పోలీసులకు కష్టంగా మారింది. విపరీతమైన జనం, తీవ్రమైన ఉక్కపోత కారణంగా చాలామంది ఊపిరాడక సొమ్మసిల్లి పడిపోయారు. పరిస్థితిని గమనించిన విజయ్ తన ప్రసంగాన్ని మధ్యలోనే ఆపివేశారు. కొందరికి స్వయంగా మంచినీటి బాటిళ్లు అందించే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ, కొద్దిసేపట్లోనే పరిస్థితి పూర్తిగా చేయిదాటి పెను తొక్కిసలాటకు దారితీసింది. సమాచారం అందుకున్న సహాయక బృందాలు, అంబులెన్సులు జనసందోహం మధ్య నుంచి అతికష్టం మీద క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించాయి. ఈ ఘటనపై సీఎం ఎంకే స్టాలిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఆయన హుటాహుటిన కరూర్ చేరుకుని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా సీఎం స్టాలిన్ మాట్లాడుతూ... "ఇది రాజకీయ విమర్శలు చేసే సమయం కాదు. బాధితులకు మెరుగైన వైద్యం అందించడమే మా ప్రథమ కర్తవ్యం. ఘటనపై విచారణకు ఒక కమిటీని ఏర్పాటు చేశాం. ఆ కమిటీ నివేదిక ఆధారంగా తగిన చర్యలు తీసుకుంటాం" అని తెలిపారు. విజయ్‌ను అరెస్ట్ చేస్తారా? అని మీడియా ప్రశ్నించగా, దాని గురించి ఇప్పుడు మాట్లాడటం సరికాదని ఆయన స్పష్టం చేశారు.



# సగం సమస్యలు ముసలి నేతల వల్లే

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌పై ఒబామా సెటైర్లు**

న్యూయార్క్: మరణ భయంతో వృద్ధ నేతలు అధికారాన్ని పట్టుకుని వేలాడుతుండటం వల్లనే ప్రపంచంలో సగానికి పైగా సమస్యలు తలెత్తుతున్నాయని అమెరికా మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా పేర్కొన్నారు. లండన్ లో జరిగిన ఓ కార్యక్రమంలో ఒబామా మాట్లాడుతూ.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పై పరోక్షంగా సెటైర్లు విసిరారు. పిరమిడ్లతో పాటు ప్రతి దానిపై తమ పేరు ఉండాలని ఈ వృద్ధ నేతలు భావిస్తుంటారని, ఇదే సమస్యలకు దారితీస్తుందని చెప్పారు. అధికారంతో పాటు వారు దేనినీ వదులుకోరని ఒబామా వ్యాఖ్యానించారు. మరోవైపు, పారాసెటమాల్ వాడకంపై ఇటీవల ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఒబామా తప్పుబట్టారు. గర్భిణిలు పారాసెటమాల్ వాడితే వారి గర్భంలో పెరుగుతున్న శిశువులు ఆటిజానికి గురవుతారని ట్రంప్ వ్యాఖ్యానించిన విషయం విదితమే. అయితే, ఈ వ్యాఖ్యలకు శాస్త్రీయ ఆధారమేమీ లేదని ఒబామా చెప్పారు. ఇలాంటి వ్యాఖ్యల వల్ల ప్రజల్లో గందరగోళం నెలకొంటుందని, ఆటిజంతో బాధపడుతున్న పిల్లల తల్లుల్లో ఆందోళన నెలకొంటుందని ఒబామా అభిప్రాయపడ్డారు.

# విజయ్ ఇంటికి భద్రత పెంపు

**ప్రజాగ్రహం వెల్లువెత్తవచ్చని ప్రభుత్వ వర్గాల హెచ్చరిక**

చెన్నై: ప్రముఖ నటుడు, రాజకీయ నాయకుడు విజయ్ ఏర్పాటు చేసిన సభలో జరిగిన ఘోర తొక్కిసలాట తమిళనాడును కుదిపేసింది. కరూర్‌లో జరిగిన ఈ దుర్ఘటనలో 39 మంది ప్రాణాలు కోల్పోగా, వంద మందికి పైగా తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతున్న నేపథ్యంలో, ముందు జాగ్రత్త చర్యగా చెన్నైలోని విజయ్ నివాసం వద్ద భద్రతను భారీగా పెంచినట్లు ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. వచ్చే ఏడాది జరగనున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు సిద్ధమవుతున్న విజయ్, తన 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీ తరఫున ఈ ర్యాలీని నిర్వహించారు. అయితే, సభా నిర్వాహకుల వైఫల్యం కారణంగానే ఈ విషాదం జరిగిందని డీఎంకే ప్రభుత్వం తీవ్రంగా విమర్శిస్తోంది. సభకు వచ్చిన ప్రజలకు కనీసం తాగునీరు, ఆహారం వంటి సౌకర్యాలు కల్పించలేదని, దీంతో చాలామంది సొమ్మసిల్లి పడిపోయారని ప్రభుత్వ వర్గాలు ఆరోపించాయి. విజయ్ సభా ప్రాంగణానికి ఏకంగా 7 గంటలు ఆలస్యంగా చేరుకున్నారని, మధ్యాహ్నం నుంచే ఎదురుచూస్తున్న జనం ఆయన రాకతో ఒక్కసారిగా దూసుకొచ్చారని తెలిసింది. అప్పటికే కిక్కిరిసి ఉన్న ప్రాంగణంలోకి విజయ్ కాన్వాయ్‌ను అనుసరిస్తూ మరికొంత మంది రావడంతో పరిస్థితి అదుపు తప్పింది. విజయ్ ప్రసంగిస్తున్న సమయంలోనూ కొందరు కుప్పకూలిపోయినా, ఆయన ప్రసంగాన్ని ఆపలేదని, అంబులెన్సులను కూడా లోపలికి అనుమతించలేదని తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. ఈ ఘటనపై విజయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. "మాటలకు అందని వర్ణనాతీతమైన బాధతో నా గుండె పగిలింది. కరూర్‌లో ప్రాణాలు కోల్పోయిన నా సోదర సోదరీమణుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను" అని ఆయన 'ఎక్స్'లో పోస్ట్ చేశారు. మరోవైపు, టీవీకే తరఫు న్యాయవాది మాట్లాడుతూ తాము పోలీసుల మార్గదర్శకాలన్నీ పాటించామని, ఈ ఘటన విజయ్‌ను తీవ్రంగా కలచివేసిందని తెలిపారు. ఈ దుర్ఘటనపై తమిళనాడు ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. టీవీకే ప్రధాన కార్యదర్శి ఎన్ ఆనంద్ సహా ముగ్గురు ముఖ్య నేతలపై హత్యానేరం కింద కేసు నమోదు చేశారు. అంతేకాకుండా, హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి నేతృత్వంలో న్యాయ విచారణకు ఆదేశించారు. ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించి, మృతుల కుటుంబాలను ఓదార్చారు.

# తప్పు పోలీసులదే.. కాదు విజయ్‌దే!

**కరూర్ తొక్కిసలాటలో 40 మంది దుర్మరణం**

**తప్పును తోసేస్తున్న పోలీసులు, విజయ్ వర్గం**



చెన్నై: తమిళనాడులోని కరూర్ పట్టణం రక్తమోడింది. నటుడు, 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) పార్టీ అధినేత విజయ్ రాజకీయ అరంగేట్ర సభ పెను విషాదానికి వేదికైంది. శనివారం జరిగిన ఈ ర్యాలీలో ఊహించని రీతిలో జరిగిన తొక్కిసలాటలో 40 మంది ప్రాణాలు కోల్పోగా, 100 మందికి పైగా తీవ్ర గాయాలపాలయ్యారు. ఈ ఘోర దుర్ఘటన వెనుక నిర్వాహకుల నిర్లక్ష్యం, పోలీసుల వైఫల్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోందని ప్రాథమిక దర్యాప్తులో తేలింది. ఈ ఘటనకు దారితీసిన ఐదు ప్రధాన లోపాలను పోలీసులు గుర్తించారు. రాష్ట్ర డీజీపీ జి. వెంకటరామన్ మీడియాకు వెల్లడించిన వివరాల ప్రకారం.. సభకు కేవలం 10 వేల మంది వస్తారని నిర్వాహకులు అంచనా వేసి అనుమతులు తీసుకున్నారు. కానీ, అనూహ్యంగా 27 వేల మందికి పైగా జనం పోటెత్తారు' అని వెల్లడించారు. అయితే, పెరిగిన జనసందోహానికి అనుగుణంగా ఏర్పాట్లు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. 27 వేల మంది జనాన్ని నియంత్రించడానికి కేవలం 500 మంది పోలీసులను మాత్రమే మోహరించారు. ఇది ఏమాత్రం సరిపోకపోవడంతో పరిస్థితి అదుపు తప్పింది. సరైన బారికేడ్లు, క్యూలైన్ల నిర్వహణ కూడా కరువైంది. పార్టీ ఎక్స్ (ట్విట్టర్) ఖాతాలో విజయ్ మధ్యాహ్నం 12 గంటలకే వస్తారని ప్రకటించారు. కానీ, ఆయన సభాస్థలికి చేరుకునేసరికి రాత్రి 7:40 అయింది. దాదాపు ఏడు గంటలకు పైగా ఎండలో, ఉక్కపోతలో ఆహారం, నీరు లేకుండా వేచి ఉన్న జనం సహనం కోల్పోయారు. మరోవైపు, గంటల తరబడి వేచి ఉన్న ప్రజలకు కనీస సౌకర్యాలైన తాగునీరు, ప్రథమ చికిత్స వంటివి ఏర్పాటు చేయడంలో నిర్వాహకులు విఫలమయ్యారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. విజయ్ వాహనం రాగానే అభిమానులు ఒక్కసారిగా వేదిక వైపు దూసుకువచ్చారు. వారిని నియంత్రించే సరైన ప్రణాళిక లేకపోవడం, అత్యవసర ద్వారాలు (ఎమర్జెన్సీ ఎగ్జిట్స్) లేకపోవడంతో తొక్కిసలాట జరిగి, ఊపిరాడక చాలా మంది ప్రాణాలు విడిచారు.

# ఆగ్రాలో పట్టుబడ్డ చైతన్యానంద

**20 కోట్ల శృంగేరి మఠం నిధుల దుర్వినియోగం**

**నకిలీ ట్రస్ట్ ఏర్పాటు చేసి మోసాలకు పాల్పడినట్టు గుర్తింపు**



ఆగ్రా: విద్యార్థినులపై లైంగిక వేధింపులు, కోట్ల రూపాయల ఆర్థిక మోసం వంటి తీవ్ర ఆరోపణలతో కొన్ని రోజులుగా పరారీలో ఉన్న వివాదాస్పద స్వామీజీ చైతన్యానంద సరస్వతిని ఎట్టకేలకు పోలీసులు అరెస్ట్ చేశారు. పక్కా సమాచారంతో రంగంలోకి దిగిన అధికారులు, ఈ తెల్లవారుజామున 3:30 గంటల సమయంలో ఆగ్రాలోని ఓ హోటల్‌లో అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఢిల్లీలోని శ్రీ శారద ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ మేనేజ్‌మెంట్-రీసెర్చ్‌కు డైరెక్టర్‌గా పనిచేసిన చైతన్యానంద (62) అసలు పేరు పార్థసారథి. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల (ఈడబ్ల్యూఎస్) స్కాలర్‌షిప్‌పై చదువుకుంటున్న 17 మందికి పైగా విద్యార్థినులతో అసభ్యంగా ప్రవర్తించాడని, వారిని తాకుతూ వేధించాడని, అసభ్యకర సందేశాలు పంపాడని తీవ్రమైన ఆరోపణలు వెల్లువెత్తాయి. అర్ధరాత్రి తన గదికి రావాలని విద్యార్థినులను బలవంతం చేసేవాడని, వారి కదలికలను ఫోన్ ద్వారా నిత్యం గమనించేవాడని ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. ఈ ఆరోపణలు తీవ్రం కావడంతో శృంగేరి మఠం యాజమాన్యం అతడిని డైరెక్టర్ పదవి నుంచి తొలగించింది. మరోవైపు, అతను దేశం విడిచి పారిపోకుండా పోలీసులు లుక్-అవుట్ నోటీసు జారీ చేశారు. లైంగిక వేధింపుల ఆరోపణలతో పాటు శృంగేరి మఠానికి చెందిన నిధులను దుర్వినియోగం చేశాడనే కేసు కూడా ఆయనపై నమోదైంది. ఇనిస్టిట్యూట్ పేరుతో 2010లో నకిలీ ట్రస్ట్ సృష్టించి సుమారు రూ. 20 కోట్ల విలువైన ఆస్తులను, నిధులను ఆ ఖాతాలోకి మళ్లించాడని 2024 డిసెంబర్‌లో నిర్వహించిన ఆడిట్‌లో తేలింది. ఈ కేసులో ముందస్తు బెయిల్ కోసం అతడు పెట్టుకున్న పిటిషన్‌ను ఢిల్లీ కోర్టు శుక్రవారం తిరస్కరించింది. కేసు నమోదైన వెంటనే బ్యాంకు నుంచి రూ. 55 లక్షలు విత్‌డ్రా చేసి, వేరే పేరుతో దొంగ పాస్‌పోర్ట్ సంపాదించి పరారైనట్టు శృంగేరి మఠం ప్రతినిధులు, పోలీసులు కోర్టుకు తెలిపారు. అన్ని వైపుల నుంచి ఉచ్చు బిగుసుకోవడంతో, చివరకు ఆగ్రాలో పోలీసులకు చిక్కాడు.

వయ్యారి చిత్రం






## ఢిల్లీ సీఎంతో ఉపాసన బతుకమ్మ వేడుకలు

ఢిల్లీ సీఎం రేఖాగుప్తాతో కలిసి మెగా కోడలు ఉపాసన బతుకమ్మ ఆడారు. ఈ సందర్భం ఢిల్లీలో జరిగింది. ఇందుకుసంబంధించిన ఫొటోలు ఇంటర్నెట్‌లో జోరుగా వైరల్ అవుతున్నాయి. ఇటీవల తెలంగాణలో సినీరాజకీయ ప్రముఖులు బతుకమ్మ ఆడుతూ పండుగకు కొత్త కళను జోడించారు. ఇప్పుడు అపోలో సంస్థాన అధినేత్రి ఉపాసన నేరుగా దేశ రాజధానికి వెళ్లి అక్కడ బతుకమ్మ ఉత్సవాల గొప్పతనాన్ని చాటుతుండటం గమనార్హం.

## మోక్షజ్ఞ కోసం కొరటాల ఎంట్రీ?

కొరటాల శివ త్వరలోనే నందమూరి బాలకృష్ణతో కలిసి పని చేయవచ్చని ఊహాగానాలు వెలువడుతున్నాయి. శివ రాసుకున్న స్క్రిప్ట్ గురించి బాలకృష్ణను కలిసి చర్చించాలని ఆసక్తిగా ఉన్నారట. అయితే ఈ ఇద్దరి సమావేశం కూడా త్వరలోనే జరగనుందని సమాచారం. ప్రస్తుతానికైతే బాలయ్యను కొరటాల శివ కలవలేదు. అటు బాలకృష్ణ అఖండ 2 పూర్తి చేయడంలో బిజీగా ఉన్నారు. ఆ తర్వాత గోపీచంద్ మలినేని, క్రిష్ తో సినిమాలు లైన్ లో పెట్టారు ఉన్నాయి. ఆయన ఈ రెండు ప్రాజెక్ట్ లతో రాబోయే సంవత్సరం పాటు బిజీగా ఉండనున్నారు. మరి కొరటాల శివ కథ రెడీ చేసింది బాలకృష్ణ కోసమా? లేదా అతని కుమారుడు మోక్షజ్ఞ కోసమా అనేది కొత్తగా వస్తున్న సందేహం. ఏదేమైనా త్వరలోనే శివ బాలయ్య మీటింగ్ ఉండనుంది. ఆ తర్వాతే దీనిపై ఓ క్లారిటీ వచ్చే చాన్స్ ఉంటుంది.





## కలలోనూ ఊహించలేదు

కాంతార చాప్టర్ 1లో యాక్ట్ చేసే అవకాశం తనకు వస్తుందని కలలో కూడా ఊహించలేదని చెప్పుకొచ్చారు రుక్మిణీ వసంత్. ఆయన తన సినిమాల ప్రీమియర్స్ చూసి ఛాన్స్ ఇచ్చారని భావిస్తున్నట్లు చెప్పారు. కాంతార టీమ్ తన ఫోన్ చేసి ఇందులో యాక్ట్ చేస్తారా అని అడిగినప్పుడు అప్పుడు వచ్చిన ఆనందాన్ని మాటల్లో వర్ణించలేనని తెలిపారు. కాంతార ప్రీక్వెల్ 4,5 శతాబ్దాల మధ్య జరిగే కథ అని, అప్పటి పరిస్థితులకు తగినట్లు నటించాలని రుక్మిణీ వసంత్ చెప్పారు. సినిమా కోసం గుర్రపు స్వారీ, కత్తి యుద్ధంలో శిక్షణ పొందడం ఎంతో సరదాగా అనిపించిందని, తాను మూవీలో కొన్ని యాక్షన్ సన్నివేశాలు చేశానని చెప్పారు. షూటింగ్ టైమ్ లో రిషబ్ శెట్టిని చూసి కొన్నిసార్లు షాక్ అయినట్లు తెలిపారు. హీరో, డైరెక్టర్ గా ఆయన ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తారని ప్రశంసల వర్షం కురిపించారు. ఆ తర్వాత తాను ఎన్టీఆర్ - ప్రశాంత్ నీల్ కాంబోలో రానున్న సినిమా, యశ్ టాక్సిక్ గురించి ఇప్పుడే ఏం చెప్పలేనని అన్నారు. కెరీర్ లో ఏ ఆఫర్ కూడా వదులుకోలేనని చెప్పారు. ఫ్యూచర్ లో రకరకాల క్యారెక్టర్స్ చేస్తానని, ఆడియన్స్ తన జర్నీ జడ్జ్ చేయాలని తెలిపారు. ఫ్యాన్స్ అంతా క్రష్ అంటున్నారని, లేబుల్స్ మాత్రం నార్మల్ అని తెలిపారు. వాళ్లంతా తన క్యారెక్టర్ కు కనెక్ట్ అవ్వడం హ్యాపీ అని చెప్పారు.

## నేడే రాజాసాబ్ ట్రైలర్ రిలీజ్

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న 'ది రాజాసాబ్' సినిమా నుంచి అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. సినిమా ట్రైలర్‌ను సోమవారం విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం 'ఎక్స్' వేదికగా అధికారికంగా ప్రకటించింది. ఈ మేరకు ఓ పవర్‌ఫుల్ పోస్టర్‌ను విడుదల చేస్తూ, అభిమానులకు సర్‌ప్రైజ్ ఇచ్చింది. ఈ ప్రకటనతో సినిమాపై ఉన్న అంచనాలు ఒక్కసారిగా పెరిగిపోయాయి. దర్శకుడు మారుతి తనదైన శైలిలో ఈ చిత్రాన్ని హారర్ కామెడీ జానర్‌లో తెరకెక్కిస్తున్నారు. ప్రస్తుతం సినిమా పనులు చివరి దశకు చేరుకున్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకోవడంతో, ఇప్పుడు అందరి దృష్టి ట్రైలర్‌పైనే నెలకొంది. ఈ నేపథ్యంలో ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా నేరుగా విడుదల తేదీని ప్రకటించడం అభిమానుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. ఈ సినిమాలో ప్రభాస్ సరసన నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిద్ధి కుమార్ హీరోయిన్లుగా నటిస్తున్నారు. బాలీవుడ్ సీనియర్ నటుడు సంజయ్ దత్ ఒక శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు. ఎస్.ఎస్. థమన్ అందిస్తున్న సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టి.జి. విశ్వప్రసాద్, కృతి ప్రసాద్ ఈ చిత్రాన్ని భారీ బడ్జెట్‌తో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు.




## ట్యూన్ కాపీ.. పాపం తమన్!

తమన్ ఏ మ్యూజిక్ అందించే సినిమాలో ఏ చిన్న పాట విడుదలైనా అది ఏ సినిమాలోనైనా ఉందా? అని వెతికే పనిలో పడతారు నెటిజన్స్. అలా మహేష్ బాబు సినిమా విషయంలో కాపీ ఆరోపణలు ఎదుర్కొని ఆయన అభిమానుల వల్ల తీవ్ర మనోవేదనకు గురయ్యారట. ఓ ఇంటర్వ్యూలో తమన్ మాట్లాడుతూ.. 'గుంటూరు కారం సినిమా సమయంలో కాపీ ట్రోల్స్ ని ఎదుర్కొని సోషల్ మీడియాలో చాలా ఇబ్బంది



పడ్డాను. ఎస్ఎస్ఎంబీ సినిమాకు మ్యూజిక్ డైరెక్టర్‌గా తమన్ చేస్తున్నారు అని చిత్ర యూనిట్ అనౌన్స్ చేయడంతో చాలామంది సోషల్ మీడియాలో నాపై విమర్శలు చేశారు. ఎస్ఎస్ఎంబీ 28 నుండి తమన్‌ను వెంటనే తొలగించండి అనే హ్యాష్ ట్యాగ్స్ ఎక్స్ వేదికగా దాదాపు 67.1%ని% పోస్టులు వైరల్ చేశారు. ఈ పోస్టులు చూసి నేను చాలా బాధపడ్డాను. ఆ సంఘటన వల్ల ఇప్పటికి బాధపడుతున్నాను. మహేష్ బాబు అభిమానులు నాపట్ల చాలా వ్యతిరేకత కలిగి ఉన్నారు. ఓ సందర్భంలో ఏడ్చాను కూడా' అని చెప్పాడు. గుంటూరు కారం మూవీ విడుదలైనప్పుడు 'కుర్చీ మడతపెట్టి' అనే పాట పూర్తిగా తమన్ కాపీ చేశారు అనే విమర్శలు ఎదుర్కొన్నారు.

## పెద్ది నుంచి రాంచరణ్ స్పెషల్ పోస్టర్

మెగా హీరో రామ్ చరణ్ సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టి ఆదివారంతో 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్నాడు. ఈ సందర్భంగా అభిమానులు, సినీ వర్గాలు ఆయనకు శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. 'చిరుత' చిత్రంతో సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టిన రామ్ చరణ్, తన 18 ఏళ్ల కెరీర్‌లో మగధీర, రంగస్థలం, ఆర్ఆర్ఆర్ వంటి బ్లాక్‌బస్టర్లతో తెలుగు సినిమా స్థాయిని ప్రపంచానికి పరిచయం చేశారు. ప్రస్తుతం బుచ్చిబాబు సానాతో పెద్ది అనే సినిమాతో చేస్తున్నాడు. అయితే రామ్ చరణ్ 18 ఏండ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ.. పెద్ది నుంచి కొత్త పోస్టర్‌ను విడుదల చేసింది. ఈ పోస్టర్‌లో రామ్ చరణ్ రస్టిక్ లుక్‌లో గడ్డం, మాసిన జుట్టుతో చాలా పవర్ ఫుల్‌గా కనిపిస్తున్నారు. నల్లటి అంగీ, ఎర్రటి చారల చొక్కా ధరించి, ముక్కుకు పోగుతో, బీడీ తాగుతూ చాలా ఇంటెన్స్ లుక్‌లో రామ్ చరణ్ దర్శనం ఇచ్చారు ఈ పోస్టర్ సినిమా కథ నేపథ్యాన్ని, చరణ్ పాత్ర శక్తిని సూచిస్తూ ఉందంటూ అభిమానులు సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వస్తున్న ఈ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామాలో జాన్వీ కపూర్ కథానాయికగా నటిస్తుండగా సంగీత దర్శకుడిగా ఏఆర్ రెహమాన్ పనిచేస్తున్నారు.





ఉత్కంఠ పోరులో టీమిండియా గ్రాండ్ విక్టరీ

దాయాది పాక్‌పై సూర్యసేన జయకేతనం

ఈ ఆసియాకప్‌లో ముచ్చటగా మూడోసారి గెలుపు

బౌలింగ్‌లో కుల్దీప్ యాదవ్ మాయాజాలం

బ్యాటింగ్‌లో తిలక్ వర్మతో

శివమ్ దుబే కీలక ఇన్నింగ్స్



# సిందూర తిలక్



**ఆసియా కప్ 2025లో భారత జట్టు ఛాంపియన్‌గా అవతరించింది. దుబాయ్ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్ మ్యాచ్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్థాన్‌పై 5 వికెట్ల తేడాతో టీమిండియా అద్భుత విజయం సాధించింది. బౌలింగ్‌లో కుల్దీప్ యాదవ్ మాయాజాలం చేయగా, బ్యాటింగ్‌లో యువ ఆటగాడు తిలక్ వర్మ అజేయ హాఫ్ సెంచరీతో జట్టును విజయతీరాలకు చేర్చాడు.**

**147 పరుగుల ఛేజింగ్ లో టీమిండియా 19.4 ఓవర్లలో 5 వికెట్లకు 150 పరుగులు చేసింది. 147 పరుగుల సాధారణ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్‌కు ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. అభిషేక్ శర్మ (5), కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (1), శుభ్‌మన్ గిల్ (12) స్వల్ప స్కోర్లకే పెవిలియన్ చేరడంతో 20 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ క్లిష్ట సమయంలో తిలక్ వర్మ (69 నాటౌట్), సంజూ శాంసన్ (24)తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశాడు.**

శాంసన్ ఔటయ్యాక క్రీజులోకి వచ్చిన శివమ్ దూబే (33)తో కలిసి తిలక్ వర్మ కీలక భాగస్వామ్యం నెలకొల్పాడు. దూబే కేవలం 22 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్సర్లతో వేగంగా ఆడి మ్యాచ్‌ను భారత్ వైపు తిప్పాడు. చివర్లో దూబే ఔటైనా, తిలక్ వర్మ సంయమనంతో ఆడి జట్టును గెలిపించాడు. పాక్ సీనియర్ పేసర్ హరీస్ రవూఫ్ విసిరిన చివరి ఓవర్లో టీమిండియా విజయానికి 10 పరుగులు అవసరం కాగా... తిలక్ వర్మ ఓ సిక్సర్ కొట్టడంతో మ్యాచ్ భారత్ వైపు మొగ్గింది. రింకూ సింగ్ విన్నింగ్ షాట్ గా ఫోర్ కొట్టడంతో భారత్ టోర్నీ విజేతగా అవతరించింది. అంతకుముందు టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న భారత్... పాకిస్థాన్‌ను కట్టడి చేసింది. పాక్ ఓపెనర్లు సాహిబ్జాదా ఫర్హాన్ (57), ఫఖర్ జమాన్ (46) రాణించినా, మిగతా బ్యాటర్లు విఫలమయ్యారు. ముఖ్యంగా భారత స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ 4 ఓవర్లలో 30 పరుగులిచ్చి 4 కీలక వికెట్లు పడగొట్టి పాక్ పతనాన్ని శాసించాడు. అతనికి తోడుగా జస్ప్రీత్ బుమ్రా, అక్షర్ పటేల్, వరుణ్ చక్రవర్తి తలా



రెండు వికెట్లు తీయడంతో పాకిస్థాన్ 19.1 ఓవర్లలో 146 పరుగులకే ఆలౌట్ అయింది. భారత బౌలర్ల సమష్టి ప్రదర్శన, ఆ తర్వాత తిలక్ వర్మ బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్‌తో టీమిండియా ఆసియా కప్‌ను కైవసం చేసుకుంది. భారత్ ఆసియా కప్ గెలవడం ఇది 9వ సారి కావడం విశేషం. కాగా, ఈసారి ఆసియా కప్ లో భారత్, పాకిస్థాన్ జట్లు మూడు సార్లు తలపడగా, అన్నింటా భారత జట్టే విజయం సాధించింది. ఆసియా కప్ చరిత్రలో భారత్–పాక్ జట్లు ఫైనల్ లో తలపడడం ఇదే మొదటిసారి కాగా, భారత్ తన ఆధిపత్యాన్ని నిరూపించుకుంది.

## కామెంటరీ బాక్స్‌లోనూ మహిళలే

### మహిళల వన్డే ప్రపంచ కప్‌లో కీలక నిర్ణయాలు

మహిళల వన్డే ప్రపంచ కప్ పోటీలకు కౌంట్‌డౌన్ మొదలైంది. మరో రెండు రోజుల్లో అహ్మదాబాద్ స్టేడియం వేదికగా మెగా టోర్నీ ప్రారంభం కానుంది. మహిళా సాధికారితను చాటేలా ఈ ప్రపంచకప్‌ను నిర్వహించాలని అంతర్జాతీయ క్రికెట్ మండలి భావిస్తోంది. అందుకే.. ఇప్పటికే పూర్తిగా మహిళా అంపైర్లు, రిఫరీలతో కూడిన బృందాన్ని ఎంపిక చేసింది. ఇప్పుడు కామెంటటేర్స్‌గానూ అతివలకే పెద్ద పీట వేసింది ఐసీసీ. భారత వెటరన్ మిథాలీ రాజ్‌తో పాటు పలువురు మాజీ క్రికెటర్లు తమదైన వ్యాఖ్యానంతో అభిమానులను అలరించనున్నారు. భారత్, శ్రీలంక ఆతిథ్యమిస్తున్న వరల్డ్ కప్ పోటీలతో మహిళా క్రికెట్‌లో కొత్త అధ్యాయం మొదలపెట్టింది ఐసీసీ. విజేతలకు ఇచ్చే ప్రైజ్‌మనీని భారీగా పెంచడమే కాకుండా పూర్తిగా మహిళా బృందంతో కూడిన అంపైర్లు, రిఫరీలను ఎంపికచేసింది. ఇక కామెంటరీ బాక్స్‌లోనూ మహిళలకే అధిక ప్రాధాన్యం ఇచ్చింది. ఈసారి మెగా టోర్నీ మ్యాచ్‌ల సందర్భంగా మాజీ క్రికెటర్లు తమదైన విశ్లేషణతో సందడి చేయనున్నారు. ఇందులో టీమిండియా మాజీలు మిథాలీ రాజ్, సనా మిర్, అంజుమ్ చోప్రాకు చోటు దక్కింది. వరల్డ్ కప్ విజేతలైన మెల్ జోన్స్, ఇషా గుహ, స్టాసీ అన్ కింగ్, జులియా ప్రైస్‌కూడా కామెంటరీ ప్యానెల్‌లో ఉన్నారు. 'స్వదేశంలో వరల్డ్ కప్ మ్యాచ్‌లను వీక్షించడం నిజంగా గొప్ప అనుభూతి. ప్రపంచ క్రికెట్లో ఇదొక వేడుక మాత్రమే కాదు భావితరం అమ్మాయిలకు స్ఫూర్తిగా నిలిచే టోర్నీ. మాజీ క్రికెటర్‌గా ప్రపంచ కప్‌లో భాగం కావడంచాలా సంతోషంగా ఉంది. కామెంటరీ బాక్స్ నుంచి ఆటకు సంబంధించిన అప్‌డేట్స్ పంచుకునేందుకు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా' అని మిథాలీ వెల్లడించింది. ప్రపంచ కప్ కామెంటేటర్స్ బృందంలోకి వరల్డ్ కప్ హీరోలను తీసుకుంది ఐసీసీ. వీళ్లలో దినేశ్ కార్తిక్, అరోన్ ఫించ్, కార్లోస్ బ్రాత్‌వైట్ వంటి పలువురు దిగ్గజ ఆటగాళ్లు ఉన్నారు. అలానే.. రెగ్యులర్ కామెంటేటర్లు కటే మార్టిన్, ఇయాన్ బిషప్, నాటాష ఫర్రంట్, రస్సెల్ అర్నాల్డ్.. నటాలీ జెర్మనోస్, అలాన్ విల్కిన్స్, కాస్ నాయుడు, రౌనక్ కపూర్, జతిన్ సప్రూలు సైతం తమ కామెంటరీతో ఫ్యాన్స్‌ను అలరించనున్నారు.



## టీ20ల్లో చరిత్ర సృష్టించిన నేపాల్

### వెస్టిండీస్‌పై ఘన విజయం

నేపాల్ క్రికెట్ జట్టు చరిత్ర సృష్టించింది. షార్జా వేదికగా జరిగిన టీ20 మ్యాచ్‌లో వెస్టిండీస్‌ను 19 పరుగుల తేడాతో మట్టికరిపించింది. దీంతో ఐసీసీలో టెస్టు హోదా కలిగిన ఓ జట్టుపై తొలిసారిగా విజయం సాధించింది రికార్డుల్లోకెక్కింది. 3 మ్యాచుల టీ20 సిరీస్‌లో భాగంగా శనివారం ఇరు జట్టు తొలి మ్యాచ్‌లో తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన నేపాల్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 148 రన్స్ చేసింది. అనంతరం స్వల్ప లక్ష్యాన్ని ఛేదించేందుకు అష్టకష్టాలు పడిన విండీస్ జట్టు.. నేపాల్ బౌలర్లను ఎదుర్కోలేక 129 పరుగుల వద్ద చతికలబడింది. దీంతో 19 పరుగుల తేడాతో కరీబీయన్ జట్టుపై హిమాలయ దేశం విజయం సాధించింది. దీంతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో 1–0తో లీడ్‌లో నిలిచింది. నేపాల్ కెప్టెన్ రోహిత్ పౌడెల్ ఆల్‌రౌండ్‌తో షోతో అదరగొట్టాడు. 35 బాల్స్‌లో 38 పరుగులు చేసి టాప్ స్కోరర్‌గా నిలిచిన పౌడెల్.. 3 ఓవర్లు వేసి ఒక వికెట్ పడగొట్టాడు. చేజింగ్‌లో నేపాల్‌కు వెస్టిండీస్ ఏ దశలో పోటీ నివ్వలేకపోయింది. రెండో ఓవర్‌లోనే 5 రన్స్ వద్ద ఓపెనర్ కైల్ మేయర్స్ వికెట్ కోల్పోయిన విండీస్ జట్టు మళ్లీ కోలుకోలేకపోయింది. క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయి ప్రత్యర్థికి మ్యాచ్‌ను సమర్పించుకుంది. కాగా, ఈ విజయాన్ని ఇటీవల జెన్–జెడ్ ఆందోళనల్లో మరణించిన వారికి అంకితమిస్తున్నట్లు నేపాల్ కెప్టెన్ పౌడేల్ ప్రకటించాడు.



## బీసీసీఐ నూతన అధ్యక్షుడిగా మిథున్ మన్హాస్

భారత క్రికెట్ కంట్రోల్ బోర్డు నూతన అధ్యక్షుడిగా మిథున్ మన్హాస్ నియమితులయ్యారు. ఆదివారం ముంబైలోని బీసీసీఐ కార్యాలయంలో నిర్వహించిన వార్షిక సర్వసభ్య సమావేశంలో మన్హాస్‌ను బీసీసీఐ అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. రాజీవ్ శుక్లాను ఉపాధ్యక్షుడిగా ప్రకటించారు. దేవజిత్ సైకియా గౌరవ కార్యదర్శిగా, ప్రభుతేజ్ సింగ్ భాటియా జాయింట్ సెక్రెటరీగా, కోశాధికారిగా ఎ రఘురామ్ భట్‌లను నియమించారు. ఇటీవల 70వ ఏట అడుగుపెట్టిన రోజర్ బిన్నీ బీసీసీఐ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో 45 ఏళ్ల మిథన్ మన్హాస్ బీసీసీఐ నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు తీసుకుంటారు. ఈ నియామకంతో జమ్ముకశ్మీర్‌లో పుట్టి బీసీసీఐ అధ్యక్షుడిగా ఎంపికైన తొలి వ్యక్తిగా మిథున్ మన్హాస్ గుర్తింపు పొందారు. కాగా ఫస్ట్ క్లాస్ క్రికెట్‌లో అపార అనుభవం ఉన్న మిథున్ మన్హాస్.. అంతర్జాతీయ క్రికెట్‌లో భారత్ తరపున ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు.



ఈవార్తలు
# ప్రజావాణి
సంపాదకీయం
నేటి ఈవార్తలు
సోమవారం 29-9-2025 | www.evarthalu.com



# 5 వేల ఏళ్ల నాగరికత.. ప్రవాహా సరస్వతి

గంగ-యమున-సరస్వతి మన భారత జాతికి జీవధారలు, మన నాగరికత, జీవన వికాసం, అభివృద్ధి అంతా.. ఈ త్రివేణిలతోనే సంగమించాయి. గంగ మనకు తెలుసు. యమునను చూశాం. పవిత్ర స్నానాలు చేశాం.. మరి సరస్వతి.. త్రివేణి సంగమమని అంటారు కానీ, ఎక్కడుంది? సరస్వతీ నదిని కళ్లారా చూసిన వాళ్లు ఎవరైనా ఉన్నారా? పురాణాలు బోలెడు చెప్తాయి. కానీ, కళ్ల ముందు కనిపించని దాన్ని ఉన్నడని ఎలా సమ్మేది? కానీ.. మహా సరస్వతి మళ్లీ దర్శనమిస్తోంది. ఇంతకాలం మిధ్యగా భావిస్తూ వచ్చిన సరస్వతీ నది.. వేల సంవత్సరాల తరువాత ఉబికుబికి పైకి వస్తోంది. మహానది సాలారంగా కనిపిస్తున్నది. ఆమె అస్తిత్వం రుజువైంది.



**కోవెల సంతోష్ కుమార్**
రచయిత
9052116463

**1986**లో మొదలైన సరస్వతి నది అన్వేషణ మొత్తం మీద ఫలితాలను ఇచ్చింది. మొదట్లో కొన్ని స్వచ్ఛంద సంస్థలే ఈ పనిని మొదలు పెట్టాయి. హర్యానాలోని సరస్వతీ శోర్ సంస్థాన్ చేపట్టిన పనికి అక్కడి సర్కారు ఊతమిచ్చింది. 2002లో కేంద్ర ప్రభుత్వం 40 అడుగుల వెడల్పు, 12 అడుగుల లోతు, 50 కిలోమీటర్ల పొడవున రూప్నహర్ కాలువను తవ్వించింది. ఇది రుగ్వేదంలో స్పష్టంగా చూపించిన సరస్వతీ నది బెడ్‌లోనే తవ్వించింది. దీంతో కాలచక్రం వెనక్కి తిరిగింది. మహాభారత కాలం కంటే ముందు నాటి వాస్తవం బయటపడింది. వేల సంవత్సరాల క్రితం మాయమైపోయిన సరస్వతీనది ఉదుకురికి.. ఉబికుబికి పైకి వచ్చేసింది. దూర దూరాల వరకూ విస్తరించిన ఎడారి ఇసుక.. మధ్యలో భూమి లోపలి నుంచి జలధార బయటకు వచ్చింది. ఒక రోజు కాదు.. రెండు రోజులు కాదు.. నెలల తరబడి అప్రతిహతంగా నీళ్లు వస్తూనే ఉన్నాయి. ఈ నీళ్ల కోసం ఎవరూ బోరు వేయించలేదు.. పైపులు వేయలేదు... కాలువలు తవ్వలేదు. సబ్‌మెర్సిబుల్ పంపులు వేయలేదు. కానీ, భూమి లోపలి నుంచి నీళ్లు ఆగలేదు. అసలే థార్ ఎడారి.. అక్కడ భూమిలోంచి నీళ్లు రావటం అంటే అందరికీ అశ్చర్యమే వేసింది. కానీ, ఈ నీటిని కార్బన్ డేటింగ్ చేయటంతో అసలు విషయం తెలిసింది. థార్ ఎడారిలో వేల అడుగుల లోతుల్లో సరస్వతి నది ప్రవహిస్తోందని.. అదే నీరు ఇప్పుడు బయటకు వస్తున్నదని. ఇప్పుడు ఎడారి భూమిని సరస్వతి నది జలధార సస్యశ్యామలం చేస్తోంది. నిజంగా ఇది ఒక అపూర్వమైన విషయం. ఇది సాగుకే కాదు.. తాగటానికీ చక్కగా ఉపయోగపడుతోంది. వేల సంవత్సరాల నాటి మహానది అనవాలు ఇది. దీని ఆధారం చేసుకుని జైసల్మేర్ ఎడారి ప్రాంతంలో ఇప్పటికి 13 చోట్ల బోరుబావులు తవ్వితే 35 అడుగుల లోతునే అమృత ధార బయటపడింది. ఇవేవీ ఒట్టి మాటలు కావు. అయిదు వేల సంవత్సరాల మన నాగరికతకు ఆనవాలు. ప్రపంచానికి దిక్సూచిగా నిలిచిన ఒక జాతి అస్తిత్వపు మూలం. భారత దేశ చరిత్రను నిర్మించిన మహానది చరిత్ర. భారత జాతికి జీవధారలను అందించిన జలశారద, సింధు నాగరికత వికసింపచేసిన నది, మహర్షుల తపస్సులకు వరాలిచ్చిన నది, మహాభారతానికి సాక్షీభూతంగా నిలిచిన నది, పాండవులను పునీతులను చేసిన నది, రామాయణాన్ని వినిపించిన నది, నాలుగు వేదాలను మనిషికి అందించిన నది సరస్వతి. అంతర్వాహినిగా ప్రవహిస్తున్న సరస్వతి మహానది భూతలంపైకి రావటం అపురూపం.

హిమాలయాల్లో సరస్వతి పుట్టింది.. అనేక ప్రాంతాల మీదుగా ప్రవహించి ప్రయాగలో గంగాయమునలతో సంగమిస్తుంది. ఈ విషయాన్ని చరిత్రకారులు ఇంతకాలంగా కొట్టిపారేస్తూ వచ్చారు. లేనిదాన్ని ఉన్నట్లుగా చూపించి మభ్యపెడుతున్నారని గొడవ చేశారు. కానీ, సరస్వతి నది గురించి ఇంతకాలం ఉన్న నమ్మకం ఇప్పుడు నిజంగా మారింది. ఉత్తరాఖండ్లోని హిమాలయ పర్వత శ్రేణుల్లోంచే సరస్వతి నది అనేక పాయలుగా కిందకు ప్రవహిస్తోందని అంతర్జాతీయ అంతరిక్ష ఉపగ్రహాల ఛాయాచిత్రాలు నిరూపిస్తున్నాయి. బద్రీనాథ్ సమీపంలోని మానా గ్రామం.. ఇక్కడ పవహిస్తున్నది ఒక నదీపాయ. ఇది సరస్వతీ నది పాయగా చెప్తారు. ఈ నది ఇక్కడి నుంచి కొన్ని మైళ్ల వరకు వెళ్లి అక్కడ అలకనంద నదిలో కలుస్తుంది. అక్కడి నుంచి పాతాళ మార్గంలో దాదాపు పదహారు వందల



కిలోమీటర్ల పొడవున ప్రవహించి అలహాబాద్ వద్ద గంగ, యమునలతో సంగమించి మోక్ష సాధకుల పుణ్యలక్ష్యాన్ని నెరవేరుస్తుంది. హర్యానా, హిమాచల్ ప్రదేశ్ ప్రాంతాల్లో వరస్వతీ నదికి సంబంధించిన ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అక్కడి స్థానిక పురావస్తు శాఖ విడుదల చేసిన చిత్రాల్లో సరస్వతీ నది ఛాయ ఉత్తరాఖండ్ మీదుగా, హర్యానా, హిమాచల్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్, గుజరాత్‌లో ప్రవహించి ఆ రాష్ట్రంలోని కచ్ సింధుశాఖ వద్ద అరేబియా సముద్రంలో కలుస్తుంది. ఈ నది ఇప్పుడు ఈ రకంగా ఇన్ని వేల సంవత్సరాల తరువాత ఎలా బయట పడింది? ఇప్పుడు బయటపడిన నీరు సరస్వతీనదికి సంబంధించిందేనని ఎలా నమ్మాలి? మనం ఒర్డిగా నమ్మక్కర్లేదు.. ఇప్పుడు సైన్సే చెప్తోంది.. సరస్వతీ నది ఉనికి గురించి.. ఉత్తరాఖండ్‌లోని బద్రీనాథ్ సమీపంలో హర్ కీ ధున్ దగ్గర సరస్వతీ నది పుట్టింది. అక్కడి నుంచి 1600 కిలోమీటర్లు ప్రయాణించి కచ్ వద్ద శ్రీకృష్ణుడి ద్వారకా నగరం ఉన్న చోట అరేబియా సముద్రంలో కలుస్తుంది. ఇస్రో, భాభా అటామిక్ రీసర్చ్ సెంటర్లు విడుదల చేసిన ఛాయా చిత్రాలు ఈ విషయాలను స్పష్టం చేస్తున్నాయి. ఈ నది ప్రవహించిన తీరం వెంట విస్తరించిన సామ్రాజ్యాల ఆనవాళ్లు.. వాటికి సంబంధించిన ఇతిహాసాలు కూడా సరస్వతినది ఉనికిని చాటుతున్నాయి. క్రీస్తుపూర్వం 5000-3000 సంవత్సరాల మధ్య కాలంలో శివాలిక్ హిల్ రేంజ్లో అతి పెద్ద టెక్టానిక్ ఈవెంట్ చోటు చేసుకుంది. భూమిలో టెక్టానిక్ పలకలు తీవ్ర స్థాయిలో కదిలిపోయాయి. దీని ప్రభావం ఇవాళి పాకిస్తాన్ లోని పోత్వార్ ప్రాంతం నుంచి, భారత్లోని అసోం దాకా కనిపించింది. భూమిలో ఈ ప్రకంపనలు సరస్వతి నదిని ఇంతకాలం కనిపించకుండా చేసేశాయి. హిమాలయ పర్వత శ్రేణుల్లో 0.8 మైళ్ల స్పాన్‌తో 3000 మీటర్ల ఎత్తున టెక్టానిక్ ఆక్టివిటీ వందల సంవత్సరాల పాటు జరుగుతూ వచ్చింది. కొండలకు కొండలే కదిలిపోయే పరిస్థితి.. ప్రళయమంటే ఇదేనేమో, ఈ ప్రళయంలోనే సరస్వతి అంతర్ధానమైపోయింది. అలాంటి చోట.. ఇన్ని వేల సంవత్సరాల తరువాత లున్ కరన్సర్, దిద్వానా, సంభార్, జైసల్మేర్, పాచ్పాదా లాంటి ప్రాంతాల్లో మళ్లీ సరస్వతి నది పైకి వస్తోంది.

రుగ్వేదంలో సరస్వతి నది ప్రస్తావన ఎన్నిసార్లు ఉందో మీకు తెలుసా? అక్షరాలా అరవైసార్లు, సింధులోయలోని ఏడు పుణ్య నదులలో చివరి నదిగా సరస్వతిని ప్రస్తావించారు. ఇది చాలా పాయలుగా విడిపోయి ప్రవహిస్తుందని కూడా రుగ్వేదం చెప్పింది. సరస్వతి నది వరదలకు తల్లి.. ఉత్తమ తల్లి, ఉత్తమ దేవత అని రుగ్వేదంలో కీర్తించారు. పంజాబ్, హర్యానాలలో కనిపించే గ0ర్-హాక్రా నది సరస్వతి నదికి పాయ అనే చెప్తారు. అంతేకాదు జియోలాజికల్ ఆధారాలతో సహా వేదాల్లోనే కనిపిస్తుంది. ఒక పక్కన సరస్వతీ నది ప్రళయకాలంలో భూగర్భంలో అంతరించిపోయిందన్న కథనాలు వచ్చాయి. ఇంకో పక్క పాండవులు రాజ్యాన్ని వదిలేసి స్వర్గలోకానికి వెళ్లే సమయంలో సరస్వతీ నదిని దర్శనం చేసుకునే ప్రయాణం చేశారట.. సింధు, రీఖలం, చెనాబ్, సట్లైజ్, బీస్, రావి, సరస్వతిలు సప్త సింధు నదులు. వీటిలో ఝిలంను వితస్థగా, చెనాబ్ను అశ్మిని అని, సట్లెజ్ను శతధు అని, రావిని ఇరావతి అని వేదాలు చెప్తున్నాయి. వీటిలో సరస్వతి తప్ప మిగతావన్నీ ఇప్పటికీ ప్రవహిస్తూనే ఉన్నాయి. ఇవాళ్టికి దాదాపు 8 వేల సంవత్సరాల క్రితం వేదాల ఉనికి మనకు తెలుస్తోంది. అప్పటి నుంచే కొన్ని నదుల అస్తిత్వమూ బయటపడింది. మన ప్రాచీన నాగరికతలు హరప్ప, సింధులోయ వంటివన్నీ కూడా సరస్వతీ నదీతీరంలోనే వికసించాయి. హిందూ పురాణాల ప్రకారం కూడా ముని ఆశ్రమాలు, యజ్ఞకుండాలు, యజ్ఞహోమాదులన్నీ కూడా సరస్వతీనదీ తీరంలోనే ఎక్కువగా జరిగాయి. పాండవుల స్వర్గారోహణ ప్రయాణం అంతా సరస్వతీ తీరం వెంబడే సాగింది. పాండవులు ద్రౌపదిని వెంటబెట్టుకుని స్వర్గానికి ప్రయాణమయ్యారు. దారి కఠినంగా ఉంది. కానీ, ప్రయాణం మాత్రం ఆగలేదు. వాళ్ల దారి మధ్యలోనే సరస్వతీ నది ప్రచండంగా ప్రవహిస్తూ కనిపించిందిట. ఆకాశమంత ఎత్తు నుంచి భూమ్మీదకు దూకి.. మళ్లీ ఆకాశాన్నంటుతోందా అన్నంతగా సరస్వతీ జలధార ఎగిసిపడుతోందట.. దాన్ని దాటుకుని వెళ్లటం పాండవులకు కష్టమైంది. ద్రౌపది భయంతో వణికి పోయిందిట. భీముడు నదికి పెద్ద గండశిలతో వంతెన నిర్మించి నదిని దాటించాడట. మానా గ్రామ సమీపంలో ఈ శిలా వంతెన ఇవాల్టికీ దర్శనమిస్తుంది. క్రీస్తు పూర్వం 3700 నాటి వేదిక్ సివిలైజేషన్ అంతా సరస్వతి, దిశధ్వతి నదీతీరాల్లో ఎక్కువగా సాగింది. దాదాపు అయిదు వేల సంవత్సరాల క్రితం సరస్వతీ నది అంతర్ధానమైంది. ఇప్పుడు మళ్లీ ప్రత్యక్షమైంది. ఎడారిలో పచ్చదనాన్ని సృష్టిస్తోంది. ఇది భారత జాతి మూలాలకు సాక్ష్యం. రాబోయే కాలంలో మరో సూపర్ పవర్ సివిలైజేషన్‌కు మరోసారి సరస్వతీ నదే నాంది కావచ్చు.

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.